సమ్మర్ క్యాంపులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి : ఎమ్మెల్యే

నర్సాపూర్, మే 11, ప్రభాతవార్త : సమ్మర్ క్యాంపులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సునీతరెడ్డి అన్నారు సోమవారం నర్సాపూర్ పట్టణంలోని పీఎం శ్రీ జడ్.పి.హెచ్.ఎస్ బాలుర పాఠశాలలో సమ్మర్ క్యాంప్ ను ఆమె ముఖ్య అతిథిగా హాజరై నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ లక్ష్మి ్మ రాజు యాదవ్ తో కలిసి ప్రారంభించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత రెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఈ శిక్షణలో పాల్గొనాలని సూచించారు ఇక్కడ నేర్చుకున్న వివిధ అంశాలను జీవితంలో ఎదగడానికి ఉపయోగించుకోవాలని విద్యార్థులకు సూచించారు ఈ క్యాంపులో విద్యార్థులకు డ్యాన్స్, మ్యూజిక్, యోగా, మెడిటేషన్, కంప్యూటర్, కోడింగ్ ,పెయింటింగ్స్ మొదలైన అంశాలపై శిక్షణ ఇస్తారని తెలియజేశారు. ఈ క్యాంపును ప్రతి విద్యార్థి సద్వినియోగ పరచుకొని జీవితంలో ఉన్నత వ్యక్తులుగా తయారు కావాలని అన్నారు ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి తారా సింగ్, జిల్లా విద్యాశాఖ ప్లానింగ్ కోఆర్డినేటర్ జ్యోతి, కమిషనర్ సాయికుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సామ్య నాయక్, కౌన్సిలర్లు సుధీర్ గౌడ్, మయినుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

లాంగ్ జంప్‌లో సత్తా చాటిన సాత్విక

దౌల్తాబాద్, మే 11 (ప్రభాతవార్త): దౌల్తాబాద్ మండలం గువ్వలేగి గ్రామానికి చెందిన కట్టెగుమ్ముల సాత్విక లాంగ్‌జంప్‌లో ప్రతిభ కనబరుస్తూ రాష్ట్రస్థాయిలో మెరిసింది. గతంలో నిర్వహించిన జిల్లా స్థాయి లాంగ్‌జంప్ పోటీల్లో ప్రథమ స్థానం సాధించి గోల్డ్ మెడల్ అందుకున్న సాత్విక,హనుమకొండలో ఆదివారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో రెండోస్థానం సాధించి సిల్వర్ మెడల్ కైవసం చేసుకుంది. గ్రామీణవిద్యార్థిని రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరచడంతో సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు అల్లి శేఖర్‌రెడ్డి, క్రీడాకారులు ఆమెను అభినందించారు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సాత్విక మాట్లాడుతూ క్రీడల్లో మరింత కష్టపడి జాతీయ స్థాయిలో కూడా రాణించాలనే లక్ష్యంతో సాధన కొనసాగిస్తున్నానని తెలిపారు.

మెడల్ అందుకుంటున్న సాత్విక

ప్రజావాణిలో దరఖాస్తులను స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ హైమావతి

ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి

సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి: ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా వచ్చిన దరఖాస్తులను సత్వరంగా పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె.హైమావతి ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించి ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల ప్రజల నుంచి దరఖాస్తులను ఆమె స్వీకరించి మాట్లాడారు. ప్రజలు తమ సమస్యలు పరిష్కారం అవుతాయని నమ్మకంతో ప్రజావాణి కార్యక్రమానికి విచ్చేసి అందజేసిన ఫిర్యాదులను క్షుణంగా పరిశీలించి అర్హతల మేరకు వెంటనే పరిష్కరించే దిశగా అధికారులు కృషి చేయాలన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి 94 దరఖాస్తులను స్వీకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డిఆర్వో నాగరాజమ్మ, వివిధశాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు

మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్

ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్

మెదక్, మే 11 (ప్రభాతవార్త): జిల్లాలో రైతులకు ఇబ్బందులులేకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను సాఫీగా నిర్వహిస్తున్నామని మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ తెలిపారు. కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన అన్ని సౌకర్యాలు అందుబాటులోఉంచామని, ధాన్యం రవాణాలో జాప్యం లేకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అన్‌లోడింగ్ సమయంలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా మిల్లర్లు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.సోమవారం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా కొల్చారంలోని ప్యాక్స్ వరి కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ నగేష్ తో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఇప్పటివరకు జరిగిన ధాన్యం కొనుగోలు వివరాలు, గన్నిబ్యాగుల సరఫరా, లారీల కేటాయింపు, ఓపీఎంఎస్ నమోదుల వివరాలను కేంద్ర నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. కొల్చారం ప్యాక్స్ కొనుగోలు కేంద్రం ద్వారా ఇప్పటివరకు 13 లారీల ధాన్యాన్ని సత్యసాయి రైస్‌మిల్లుకు తరలించినట్లు కలెక్టర్ తెలిపారు. కేంద్రంలో హమాలీల కొరత లేదని పేర్కొన్నారు. సివిల్ సప్లై అధికారులు తరచూ కొనుగోలు కేంద్రాలను సందర్శిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పర్యవేక్షిస్తున్నారని వెల్లడించారు. కార్యక్రమంలో కొల్చారం తహసీల్దార్ శ్రీనివాస్‌చారి, సొసైటీ చైర్మన్ నాగూర్ మనోహర్, కొల్చారం సీఈవో పార్థీ కృష్ణ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఉపాధి హామీ పనులు చేపట్టాలి

-పిఆర్‌డి ప్రత్యేక కమిషనర్ శ్రీలక్ష్మి

కంది, మే 11, ప్రభాతవార్త: ప్రతి గ్రామంలో ఉపాధి హామీ పనులను విధిగా చేపట్టాలని పంచాయతీరాజ్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ ప్రత్యేక కమిషనర్ శ్రీలక్ష్మి సూచించారు.సోమవారం మండలంలో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను శ్రీలక్ష్మి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా శ్రీలక్ష్మి మాట్లాడుతూ ఉపాధిపనులు చేపట్టేందుకు వచ్చిన ఉపాధి కూలీల ఫొటోలు తీసుకుని హాజరువేయాలని సూచించారు. పని ప్రదేశంలో మస్టర్ విధిగా ఉండాలని చెప్పారు. ఎండలు మండిపోతున్నందున ఉదయం 6 గంటలకు పని ప్రదేశానికి చేరుకుని 10 గంటల వరకు పనులు పూర్తిచేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిఆర్‌డిఓ జ్యోతిలక్ష్మి, అదనపు డిఆర్‌డిఓ బాలరాజు, ఎంపిడిఓ శ్రీనివాస్, ఏపిఓలు పాల్గొన్నారు.

ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేయాలి

సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

సంగారెడ్డి మున్సిపాలిటీ, మే11, ప్రభాతవార్త : ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను వేగవంతంచేయాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి సోమవారం హైదరాబాద్ నుంచి సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి ఎస్ఐఆర్ ప్రక్రియపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల మ్యాపింగ్ పురోగతి ఆశించిన స్థాయిలో జరగడం లేదన్నారు. ప్రస్తుతం కొన్ని నియోజకవర్గాలు మాత్రమే 90 శాతం పురోగతి సాధించాయని తెలిపారు. వచ్చే 15 రోజుల్లో అన్ని జిల్లాలు వేగంగా పనిచేసి 90 శాతం లక్ష్యాన్ని చేరుకోవాలని అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి సంబంధిత అధికారులతో కలిసి వీసీలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ ఎస్ఐఆర్ లో జిల్లాలో యావరేజ్ గా 58!! పైగా అయిందని, పటాన్చెరు నియోజకవర్గంలో గత వారంకన్నా ఇప్పుడు కొంతపురోగతి సాధించిందనీ, మరింత పురోగతి సాధించాలని అధికారులకు సూచించారు. ఏమైనా సమస్యలు ఉంటే సంబంధిత అధికారులు పరిష్కరించి, ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ పాండు, ఆర్డిఓ రాజేందర్, తహసిల్దార్ జయరాం, ఎన్నికల విభాగం సిబ్బంది పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్ రూరల్, మే 11, ప్రభాతవార్త హుస్నాబాద్ నియోజకవర్గంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు సమన్వయంతో పని చేయాలని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. సోమవారం నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో సిద్దిపేట, కరీంనగర్, హన్మకొండ జిల్లాల అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలు, డీఎస్వోలు, సివిల్‌సప్లై అధికారులు, ఎమ్మార్వోలు, వ్యవసాయ అధికారులు, కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జీలు, గ్రామ స్థాయి ధాన్యం కొనుగోలు కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రస్తుతం భారీగా ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తున్నందున కొనుగోలు ప్రక్రియ వేగవంతంగా జరగాలని సూచించారు. రైతులు ఇబ్బందులుపడేలా అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కొనుగోలు కేంద్రాల్లో గన్నీ బ్యాగుల కొరత లేకుండా చూడాలని, సాయంత్రం కురిసే వర్షాల కారణంగా ధాన్యం తడవకుండా టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఇటీవల వర్షానికి తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేస్తోందని తెలిపారు. ప్రతి గ్రామానికి ఏర్పాటు చేసిన ఐదుగురు సభ్యుల కమిటీ అధికారులు సమన్వయంతో పనిచేస్తూ నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో ఏ సమస్య వచ్చిన వెంటనే తమ కార్యాలయ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. గ్రామ, మండల, జిల్లా స్థాయిలో కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి ఆటంకాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ముఖ్యంగా మిల్లుల వద్ద సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలపై ప్రత్యేక కంట్రోల్ రూమ్ ద్వారా మానిటరింగ్ నిర్వహించాలని, ధాన్యం తరలింపులో వాహనాల కొరత రాకుండా ప్రతి జిల్లాకు ప్రత్యేకంగా ఒక ఎంవీఐ అధికారిని నియమించాలని డీటీసీలకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. హమాలీల కొరత లేకుండా చూడాలని, హుస్నాబాద్ మార్కెట్ యార్డులో భారీగా ధాన్యం రావడంతో ఇప్పటికే పనిచేస్తున్న ఐదు కాంటా బృందాలకు అదనంగా మరిన్ని బృందాలు ఏర్పాటు చేయాలని సూచించారు. అక్కన్నపేట, హుస్నాబాద్ టౌన్, శనిగరం, కోహెడ, బస్వాపూర్ ధాన్యం కొనుగోలు కేంద్రాలపై అధికారులు ప్రత్యేక అప్రమత్తతతో ఉండాలని మంత్రి ఆదేశించారు. శనిగరం కేంద్రానికి రోజుకు మూడు నుంచి నాలుగు లారీలు వస్తున్నందున అదనపు లారీలు లేదా ట్రాక్టర్లను వినియోగించాలని సూచించారు.

టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న మంత్రి ప్రభాకర్

ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలి

సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

సంగారెడ్డి మున్సిపాలిటీ , మే 11, ప్రభాతవార్త : ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించే దిశగా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లోని గ్రీవెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుంచి వివరాలు తెలుసుకుని, సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులకు తగిన సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సంగారెడ్డి లోని పలు ప్రాంతాల్లో మ్యాన్‌హోల్స్ తెరిచి ఉండటం ప్రమాదకరమని పేర్కొన్నారు. ప్రమాదాలు జరగకముందే వాటిని పరిశీలించి వెంటనే మూసివేయాలని మున్సిపల్ కమిషనర్‌కు ఆదేశించారు. అలాగే ఆర్ అండ్ బి రోడ్ల డివైడర్లపై ఏర్పాటుచేసిన పెద్ద పెద్ద ఫ్లెక్సీలు, పాత ఫ్లెక్సీలను తొలగించాలని సంబంధిత అధికారులకు సూచించారు. సింగూర్ డ్యాంవద్ద బారికేడ్లు, హెచ్చరిక సైన్ బోర్డులులేవని తన దృష్టికి వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రజల భద్రత దృష్ట్యా ప్రమాదాలు నివారించేందుకు వెంటనే బారికేడ్లు, సైన్‌బోర్డులు ఏర్పాటుచేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. ప్రజావాణి ద్వారా వచ్చిన ఫిర్యాదులను 30 రోజులలోగా పరిష్కరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సమస్యల పరిష్కారంలో ఎలాంటి జాప్యం లేకుండా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. జిల్లాలో డివిజన్ వారీగా నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమాల్లో మొత్తం 108 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. అందులో కలెక్టరేట్‌కు 23, సంగారెడ్డి డివిజన్‌కు 27, ఆందోల్ డివిజన్‌కు 03, నారాయణఖేడ్ డివిజన్‌కు 27, జహీరాబాద్ డివిజన్‌కు 29 ఫిర్యాదులు అందినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు సంగీత, పాండు, జిల్లా అధికారులు, రెవెన్యూ డివిజనల్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే

బెజ్జంకి, మే 11, ప్రభాతవార్త : మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో రూ.60 లక్షలతో నూతనంగా మంజూరైన అదనపు తరగతి గదుల నిర్మాణానికి ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ సోమవారం భూమి పూజ చేశారు. అనంతరం లక్ష్మీపూర్ గ్రామంలో రూ.25 లక్షల నిధులతో నిర్మించ తలపెట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ప్రాథమిక పాఠశాలలో రూ.6 లక్షలతో వంటగది నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఒగ్గు దామోదర్, ఎఎంసి చైర్మన్ పులి కృష్ణ, వైస్ చైర్మన్ చిలివేరు శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ ముక్కిస కవిత రత్నాకర్‌రెడ్డి, ముక్కిస రత్నాకర్‌రెడ్డి, బైర సంతోష్,లింగాల శ్రీనివాస్, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సీపీ రష్మీ పెరుమాళ్

లాడ్జీలు, రిసార్ట్స్, హోటల్స్, ఫాంహౌస్ యాజమాన్యాలు

నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు

సీపీ రష్మీ పెరుమాళ్

సిద్దిపేట,ప్రభాతవార్త ప్రతినిధి: లాడ్జీలు,రిసార్ట్స్,హోటల్స్,ఫాంహౌస్ యాజమాన్యాలు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సీపీ సాధన రష్మీపెరుమాళ్ సూచించారు. జిల్లాలోని లాడ్జీలు, రిసార్ట్స్,హోటల్స్,ఫాంహౌస్ యాజమాన్యాలు, మేనేజర్లతో ఆమె సోమవారం సీపీ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి హోటల్, లాడ్జీ,ఫాంహౌస్ ప్రవేశ ద్వారాల వద్ద డోర్ ఫ్రేమ్ మెటల్ డిటెక్టర్, హ్యాండ్ హెల్డ్ మెటల్ డిటెక్టర్ ద్వారా తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి ప్రాంగణంలో నాణ్యమైన సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసి కనీసం 60 రోజుల వరకు బ్యాకప్ ఉండేలా చూడాలన్నారు. సంబంధిత పోలీసు స్టేషన్, ఎస్‌హెచ్ఓ ఫోన్ నంబర్లు నోటీస్‌బోర్డులపై స్పష్టంగా ప్రదర్శించాలన్నారు.అత్యవసర పరిస్థితుల్లో వినియోగించేందుకు ప్రత్యేక ద్వారం గేట్లు ఉండేలా చూడాలన్నారు. ఫైర్ సేఫ్టీ ఆడిట్ నిర్వహించాలన్నారు. ఉద్యోగులకు ఫైర్ సేఫ్టీపై ప్రాథమిక శిక్షణ కల్పించాలన్నారు.ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన ఉద్యోగుల వివరాలను పరిశీలించాలని మైనర్లు ఉద్యోగాల్లో ఉండకూడదని చెప్పారు. నకిలీ ఆధార్ కార్డుల పట్ల అప్రమత్తంగా ఉండాలని అనుమానం వచ్చిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. లాడ్జీలు, హోటల్స్,ఫాంహౌస్‌లలో బసకు వచ్చే కస్టమర్ల పూర్తి వివరాలను ప్రతి రోజూ పోలీసు స్టేషన్‌లో అందజేయాలన్నారు. కొత్తగా రూములు తీసుకునే వ్యక్తుల పూర్తి వివరాలు నమోదు చేయాలని అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే డయల్ 100కు కాల్ చేయాలన్నారు. లాడ్జీలు, రెసార్ట్స్,ఫాంహౌస్‌లు, హోటల్స్‌లో ఎలాంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలు జరగకుండా యాజమాన్యాలు బాధ్యత వహించాలని నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో పోలీసు అధికారులు కుశాల్కర్, అయేషా ఫాతిమా, ఎసిపిలు, సీఐలు తదితరులు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాల వద్ద 163 బిఎన్ఎస్ఎస్ సెక్షన్ అమలు...

సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి: ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల నేపథ్యంలో పరీక్షా కేంద్రాల వద్ద 163 బిఎన్ఎస్ఎస్ సెక్షన్ అమలు చేస్తున్నట్లు సీపీ సాధన రష్మీ పెరుమాళ్ సోమవారం తెలిపారు. ఈనెల 13 నుంచి 21 వరకు పరీక్ష జరగనుండడంతో జిల్లాలోని 27 పరీక్షా కేంద్రాల సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. పరీక్షా కేంద్రాల చుట్టూ 500 మీటర్ల పరిధిలో 5గురు కంటే ఎక్కువ మంది గుమిగూడరదన్నారు. పరీక్ష జరిగే ప్రతి రోజూ ఉయదం 7 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు సెక్షన్ అమలు చేయడం జరుగుతుందన్నారు. పరీక్షలు జరిగే సమయంలో పరీక్షా కేంద్రాల సమీపంలోని అన్ని జిరాక్స్ సెంటర్లను విధిగా మూసివేయాలన్నారు. విద్యార్థులు ఎలాంటి ఆందోళన చెందకుండా పరీక్షలు రాసేలా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

కలెక్టర్ జోలికొస్తే ఖబడ్దార్

పనిచేతకాక అధికారిపై ఆరోపణలా...బిఆర్ఎస్ నేత చౌదరి సుప్రభాతరావు

రామాయంపేట, మే 11, ప్రభాతవార్త : మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్‌పై సోషల్ మీడియాలో అనవసర విమర్శలు చేయడం తగదని, ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేస్తున్న సమయంలో రాజకీయ ప్రయోజనాలకోసం వారిని టార్గెట్ చేయడం సరికాదని బిఆర్ఎస్ సీనియర్ నాయకులు చౌదరి సుప్రభాతరావు అన్నారు.సోమవారం రామాయంపేటలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, చేతకాని పాలనను కప్పిపుచ్చుకునేందుకే అధికారులపై ఆరోపణలు చేస్తూ కాంగ్రెస్ నాయకులు రాజకీయ డ్రామాలకు దిగుతున్నారని ఆయన తీవ్రస్థాయిలో మండిపడ్డారు. జిల్లాలో రైతుల పరిస్థితి రోజురోజుకూ దయనీయంగా మారుతోందన్నారు.కొనుగోలు కేంద్రాలవద్ద రోజుల తరబడి ధాన్యం కుప్పలుగా పేరుకుపోయి రైతులు నిద్రలేని రాత్రులు గడుపుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదని విమర్శించారు. పంటను అమ్ముకునేందుకు రైతులు పడుతున్న ఇబ్బందులను పరిష్కరించాల్సిన ప్రభుత్వం, సమస్యలపై ప్రశ్నించే వారినే టార్గెట్ చేస్తోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పనిచేయలేని నాయకులు ఇప్పుడు అధికారులపై నెపం మోపుతూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. రైతులకు అండగా నిలవాల్సిన కాంగ్రెస్ నేతలు కేవలం ఫోటోలు, ఆందోళనలకే పరిమితమయ్యారని ఎద్దేవా చేశారు.

రామాయంపేటలో ఆర్డీవోను నియమించాలి...

బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి సీఎం కేసీఆర్ రామాయంపేటను రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ప్రకటించినప్పటికీ ఇప్పటివరకు ఆర్డీవో నియామకం జరగకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు.వెంటనే రామాయంపేటకు పూర్తి స్థాయి ఆర్డీవోను నియమించి ప్రజల సమస్యలకు పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ స్థాయిలో బంద్‌లు, రిలే నిరాహార దీక్షలు చేపడతామని హెచ్చరించారు.

మాట్లాడుతున్న చౌదరి సుప్రభాతరావు

అంతర్గత రోడ్డు మరమ్మతులు చేయాలి...

రామాయంపేట పట్టణ అంతర్గత ప్రధాన రహదారి వెడల్పును 40 ఫీట్లకు తగ్గకుండా మరమ్మతులుచేపట్టాలని ఆయన సూచించారు. పట్టణం రూపురేఖలు మారేది ఆరోడ్డుతోనేనని, ప్రజల చిరకాల కోరిక నెరవేర్చే బాధ్యత పాలకులదేనని గుర్తు చేశారు. ఎల్లప్పుడూ రైతుల పక్షాన పోరాడేది బిఆర్ఎస్ మాత్రమేనని, ప్రభుత్వం ఇప్పటికైనా మేల్కొని ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మద్దెల రమేష్, దోమకొండ యాదగిరి, ఎస్‌కె అహ్మద్, అల్లాడి వెంకటేశ్, హస్నొద్దిన్, రొయ్యల నవీన్, సందీప్‌గౌడ్, రేవెల్లి వినయ్ సాగర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

లంచం తీసుకుంటూ ఎసిబికి చిక్కిన పంచాయతి కార్యదర్శి, సర్పంచ్ భర్త

ఎసిబి వలలో పంచాయతీ కార్యదర్శి

పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్ భర్త అరెస్టు

కొమురవెల్లి, మే 11, ప్రభాతవార్త : మండల కేంద్రంలో ఎసిబి అధికారుల దాడులు కలకలంరేపాయి. మెదక్‌రేంజ్ డిఎస్పి సుదర్శన్ కథనం ప్రకారం... కొమురవెల్లి పంచాయతీ కార్యదర్శి రాజుగౌడ్ రూ.10 వేల లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడడంతోపాటు సర్పంచ్ భర్తను అరెస్టు చేసినట్లు తెలిపారు. కొమురవెల్లిలో సోమవారం అవినీతి నిరోధక శాఖ అధికారులు మెరుపు దాడి నిర్వహించారు. లంచం తీసుకుంటూ పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్ భర్త ఎసిబి అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. కొమురవెల్లి గ్రామానికి చెందిన ఫిర్యాదుదారుడు ప్లాట్‌లో గ్రామ పంచాయతీ డ్రైనేజీ పైప్‌లైన్ వేశారు. ఆ పైపులైన్‌ను అక్కడ నుంచి తొలగించాలనే అధికారిక పని కోసం పంచాయతీ కార్యదర్శి గడ్డం రాజుగౌడ్ రూ.10 వేల లంచం డిమాండ్ చేశారు. దీంతో బాధితుడు ఎసిబి అధికారులను ఆశ్రయించడంతో పక్కా ప్రణాళికతో అధికారులు నిఘా పెట్టారు. సర్పంచ్ భర్త ద్వారా నగదు స్వీకరణ చేశారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో లంచం డబ్బులు తీసుకుంటుండగా అధికారులు దాడిచేశారు. పంచాయతీకార్యదర్శి ఆదేశాల మేరకు సర్పంచ్ భర్త గొల్లపల్లి అంజనేయులు రూ.10 వేలు స్వీకరించారు. అధికారులు పంచాయతీ కార్యదర్శితో పాటు సర్పంచ్ భర్తను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకొని వారి నుంచి లంచం సొమ్మును స్వాధీనం చేసుకున్నారు. అవినీతికి పాల్పడిన పంచాయతీకార్యదర్శి రాజుగౌడ్‌తోపాటు సర్పంచ్ భర్త అంజనేయులను అధికారులు అరెస్టు చేశారు. ఇద్దరిని హైదారాబాద్‌లోని ఎసిబి ప్రత్యేక కోర్టులో హాజరుపరచనున్నారు. ఏ ప్రభుత్వ ఉద్యోగి అయినా లంచం డిమాండ్ చేస్తే వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1064కు ఫిర్యాదు చేయాలని ఎసిబి అధికారులు సూచించారు. ఫిర్యాదుదారుల వివరాలను రహస్యంగా ఉంచుతామన్నారు. దాడిలో ఎసిబి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పెళ్లయి నెల రోజులు గడవక ముందే

నవ దంపతుల ఆత్మహత్య

కొండపాక, మే 11, ప్రభాతవార్త : పెళ్లయిన నెల రోజుల్లోనే భార్యభర్తలు ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. కుకునూరుపల్లి పోలీసుల కథనం ప్రకారం... కొండపాక గ్రామానికి చెందిన దండ్ల అంజలి(21,వృత్తి టెలరింగ్), కొమురవెల్లి గ్రామానికి చెందిన దెశెట్టి వినయ్ (23) కూలీ పనిచేస్తుండగా వీరుద్దరు సంవత్సరం నుంచి ప్రేమించుకుంటున్నారు. పెద్దల అంగీకారంతో గతనెల ఏప్రిల్ 9న వీరిద్దరి వివాహం జరిగింది. కాగా పెళ్లయిన కొద్దిరోజులకే వినయ్ భార్య అంజలి ఫోన్‌లో ఎవరితోనో మాట్లాడుతుందని అనుమానించాడు. కోపంలో భార్యను అత్తగారింటి వద్ద ఈ నెల 7న కొండపాకలో దింపి వెళ్లిపోయాడు. అనంతరం వినయ్ అంజలికి రెండు మూడుసార్లు ఫోన్‌చేయగా వెంటనే ఫోన్‌ఎత్తి మాట్లాడకుండా ఉండేది. కొంత సేపటికి ఆమె భర్త వినయ్‌కి ఫోన్ చేసి మాట్లాడగా ఆమెపై మరింత అనుమానం పెంచుకొని ఆగ్రహం వ్యక్తం చేశాడని తెలిపారు. దీంతో అంజలి మనస్తాపం చెంది ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. కాగా ఉపాధి కోసం హైదరాబాద్ వెళ్లిన వినయ్‌కు భార్య ఆత్మహత్య చేసుకున్న విషయం తండ్రి సహదేవ్ ఫోన్‌చేసి చెప్పాడు. దీంతో అతడు హైదరాబాద్ నుంచి ద్విచక్ర వాహనంపై ఇంటికి వస్తూ మార్గమధ్యలో కుకునూరుపల్లి మండలం రాయవరం గ్రామ శివారులోకి వచ్చి తండ్రికి ఫోన్‌చేసి మీరు జాగ్రత్తగా ఉండండి అని బాధతో చెప్పి, స్నేహితులకు తనున్న లోకేషన్ పంపించాడు. అనంతరం మనస్తాపం చెంది అక్కడే తుమ్మచెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. కొడుకు మాట్లాడిన మాటాలకు తండ్రికి అనుమానం వచ్చి వెంటనే కొడుకు స్నేహితులతో కలిసి లోకేషన్‌కు వెళ్లి చూడగా అక్కడ వినయ్ చెట్టుకు ఉరేసుకొని మృతి చెంది ఉన్నాడని చెప్పారు. మృతురాలు అంజలి తల్లి పోచవ్వ, మృతుడు వినయ్ తండ్రి దెశెట్టి సహదేవ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. కాళ్లపారణి అరకముందే నవ దంపతులిద్దరు అత్మహత్య చేసుకోవడంతో ఇరు కుటుంబాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.

కారు ఢీకొని విద్యార్థిని మృతి

వర్గల్, మే 11 (ప్రభాతవార్త): అతివేగంగా వచ్చిన కారు ఢీకొట్టడంతో విద్యార్థిని మృతి చెందిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. గౌరారం ఎస్ఐ జె.ఆరోగ్యం తెలిపిన వివరాల ప్రకారం సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండలం ఇందూర్ గ్రామానికి చెందిన జె.భార్గవి(21) గౌరారంలోని ఎంజెపి డిగ్రీ కళాశాలలో తృతీయ సంవత్సరం చదువుతుంది. సోమవారం ఉదయం 11.30 గంటల సమయంలో మార్స్ ఇండియా కంపెనీ ముందు విద్యార్థిని భార్గవి నడుచుకుంటూ రోడ్డు దాటుతుండగా సిద్దిపేట నుండి హైద్రాబాద్ వైపు అతివేగంగా వెళ్తున్న టాటా జెస్ట్ కారు ఢీకొట్టింది. దీంతో ఆమెకు తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది. మృతురాలి తండ్రి విఠల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్ సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం కడవేర్గు గ్రామానికి చెందిన జంగా రాజుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మామిడ్గిలో జూదరుల అరెస్టు

-7020 నగదు, 6 మొబైల్‌లు, 52 పేకముక్కలు స్వాధీనం

న్యాల్‌కల్, మే 11, ప్రభాతవార్త: మండల పరిధిలోని మామిడ్గి గ్రామ శివారులో తుక్కారెడ్డి వ్యవసాయ క్షేత్రంలో పేకాట ఆడుతున్న 7 మంది జూదరులను సోమవారం హద్నూర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ దోమ సుజిత్ కథనం ప్రకారం... మామిడ్గి గ్రామ శివారులో పేకాట ఆడుతున్నట్లు నమ్మదిగిన సమాచారంతో సిబ్బందితో కలిసి జూదగృహంపై దాడిచేసి పేకాట ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకున్నామన్నారు. 52 పేక ముక్కలను, 6 మొబైల్ ఫోన్‌లను, 7020 నగదును స్వాధీనం చేసుకుని ఏడుగురిపై కేసు నమోదు చేశామని తెలిపారు. పోలీసు ఠాణా పరిధిలోని గ్రామాల్లో చట్టవ్యతిరేక కార్యకాలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ దోమ సుజిత్ హెచ్చరించారు.

పేకాట ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

రాష్ట్రస్థాయి కరాటే ఛాంపియన్‌షిప్‌లో సదాశివపేట విద్యార్థుల ప్రతిభ

విజేతలకు బహుమతులు అందిస్తున్న దృశ్యం

సదాశివపేట, మే 11, ప్రభాతవార్త:
తెలంగాణ రాష్ట్రంలోని పివి నరసింహారావు ఆడిటోరియంలో మే 10, 2026న నిర్వహించిన రాష్ట్రస్థాయి కరాటే ఛాంపియన్‌షిప్‌లో సదాశివ పేటకు చెందిన విద్యార్థులు ప్రతిభచాటారు. జెకెఎ తెలంగాణ రాష్ట్ర బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ కె.శంకర్ ఆధ్వర్యంలోని అకాడమీనుంచి 20మంది విద్యార్థులు పాల్గొని పలువిభాగాల్లో స్వర్ణ, రజత, కాంస్య పతకాలను సాధించి అకాడ మీకి కీర్తి తీసుకొచ్చారు. ఈఛాంపియన్‌షిప్‌లో మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ తదితర రాష్ట్రాల నుంచి వచ్చిన పోటీదారులతో పోటీపడి విద్యార్థులు అసాధారణ ప్రతిభను కనబరిచారు. కటావిభాగం జూనియర్స్ లో సి.సోమీక్ష, సి.సహస్ర, సాయిప్రియ, కావ్య, కార్తీక, ఆనంది, సాయి కృతి, స్వప్న ప్రతిభ కనబరిచారు. కుమిటే విభాగం సీనియర్స్‌లో ఎం. పూజిత, సి.అనుప్రియ, టి.హారిక, జూనియర్స్‌లో బి.విక్రమ్, ఖుషికుమా రి, శివాని పతకాలు సాధించారు. ఈ కార్యక్రమానికి గూడెం మహిపాల్ రెడ్డి, సుమన్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. కటా, స్పారింగ్ విభాగా ల్లో వైట్ బెల్ట్ నుంచి బ్లాక్ బెల్ట్ వరకు పోటీలు నిర్వహించగా, మొత్తం రూ.60వేల నగదు బహుమతులను ప్రకటించారు.

ఖేడ్ ప్రజావాణిలో 27 దరఖాస్తులు


వినతులు స్వీకరిస్తున్న అధికారులు

నారాయణఖేడ్, మే 11, ప్రభాతవార్త:
నారాయణఖేడ్ సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సబ్‌కలెక్టర్ ఉమాహారతి, ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం విజయవంతంగా ముగి సింది. ఈకార్యక్రమంలో ప్రజలనుండి మొత్తం 27దరఖాస్తులు స్వీకరించ బడినవి. కార్యక్రమంలో డివిజన్‌స్థాయి అధికారులు, మండలపరిషత్ అభి వృద్ధి అధికారులు, తహసీల్దార్లు, ఇరిగేషన్, ఆరోగ్య, వైద్య, విద్య, సివిల్ సప్లైస్, సోషల్ వెల్ఫేర్ తదితరశాఖల అధికారులు పాల్గొని, ప్రజలనుండి స్వీకరించబడిన వినతులను పరిశీలించారు. సంబంధితశాఖల అధికారులు స్వీకరించిన వినతులపై తక్షణచర్యలు తీసుకోవాలని సబ్‌కలెక్టర్ ఉమా హారతి ఆదేశించారు.

రోడ్డు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి

-ఎఎస్ఐ రాములు


వాహన పత్రాలు పరిశీలిస్తున్న పోలీసులు

చిలిపిచెడ్, మే 11, ప్రభాతవార్త:
వాహన చోదకులు తప్పనిసరిగా రోడ్డు నిబంధనలు పాటించాలని ఎఎస్ఐ రాములు అన్నారు. సోమవారం మండల పరిధిలోని చిట్కుల్ చౌరస్తా వద్ద పోలీసులు వాహనాలు తనిఖీచేయడంతోపాటు ప్రయాణికులకు రోడ్డు నిబం ధనలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీస్‌సిబ్బంది ఎఎస్సై రాములు, దేవ్‌సింగ్, దుర్గప్రసాద్, వాహనదారులు పాల్గొన్నారు.

పదోతరగతి మండల టాపర్‌కు సన్మానం


రవీంద్రభారతిలో సన్మానం పొందిన విద్యార్థి హర్షవర్ధన్‌రెడ్డి

పాపన్నపేట, మే 11, ప్రభాతవార్త:
హైదరాబాదులో నిర్వహించిన మహాత్మ జ్యోతిరావుపూలే ప్రతిభా పురస్కా రానికి చికోడ్ లింగయ్యపల్లి ఉన్నతపాఠశాల విద్యార్థి ఎంపికైనట్లు ఆ పాఠ శాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి వెల్లడించారు. ఇందులోభాగంగా సోమవారం రవీంద్రభారతిలో నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో విద్యార్థి హర్షవర్ధన్‌రెడ్డిని ప్రముఖులు సన్మానించారు. ఇటీవల వెలువడిన పదవ తరగతి పరీక్షల్లో హర్షవర్ధన్‌రెడ్డి పాపన్నపేట మండల్ టాపర్‌గా నిలిచాడు, అయితే రాష్ట్రవ్యాప్తంగా పదోతరగతి ఫలితాల్లో మండల టాపర్‌గా ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు సోమవారం రవీంద్రభారతిలో సన్మానం నిర్వ హించినట్లు పాఠశాల హెడ్మాస్టర్ విజయలక్ష్మి వివరించారు.

తెల్లాపూర్ డివిజన్‌లో పోలింగ్ బూత్ ఓట్లను కలపాలి

-తహసీల్దార్‌కు సొసైటీ చైర్మన్ వినతి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందచేస్తున్న సొసైటీ చైర్మన్ బుచ్చిరెడ్డి

రామచంద్రాపురం, మే 11, ప్రభాతవార్త:
తెల్లాపూర్ డివిజన్‌లోగల మై హోమ్ అంకురలో నివాసం ఉంటున్న వారి ఓట్లు 412,413 బూత్‌లలో ఉన్నాయని సొసైటీచైర్మన్ మల్లెపల్లి బుచ్చిరెడ్డి అన్నారు. సోమవారం బుచ్చిరెడ్డి తహసీల్దార్‌కు పటాన్‌చెరు డిప్యూటీ కమిషనర్‌లకు వినతిప్రతాలు అందచేశారు. ఈసందర్భంగా చైర్మన్ బుచ్చి రెడ్డి మాట్లాడుతూ మై హోమ్ పరిధిలోని ఓట్లు ఉన్న 412,413 బూత్ లను భారతీనగర్ డివిజన్‌లోకి వెళ్లాయన్నారు. తెల్లాపూర్ డివిజన్ పరిధి లోని వారి ఓట్లు తెల్లాపూర్ డివిజన్‌లోనే ఉండేలా భారతీనగర్ డివిజన్ నుంచి తెల్లాపూర్ డివిజన్‌కు మార్చి ఓటర్లకు సహకరించాలని సొసైటీ చైర్మన్ బుచ్చిరెడ్డి పేర్కొన్నారు.

ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

-జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

సంగారెడ్డి మున్సిపాలిటీ, మే 11, ప్రభాతవార్త:
జిల్లాలో ఈనెల 13నుండి 21వరకు నిర్వహిం చనున్న ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు సజావుగా, ప్రశాంతవాతావరణంలో జరిగే లా అన్నిశాఖలు సమన్వయంతో పకడ్బందీ ఏర్పా ట్లుచేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ మినీసమావేశమందిరంలో ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లి మెంటరీ పరీక్షల నిర్వహణపై కలెక్టర్ అధ్యక్షతన సంబంధితశాఖల అధికారులతో కోఆర్డినేషన్‌కమిటీ సమావేశంజరిగింది. జిల్లాలో ఈపరీక్షలకు మొత్తం 13,862 మంది విద్యార్థులు హాజరుకానున్నారని, అందులో మొదటి సంవత్సరం పరీక్షలకు 9,591 మంది, ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 4,271 మంది విద్యార్థులు హాజరవుతున్నట్లు వెల్లడించా రు. జిల్లాలో 27పరీక్షాకేంద్రాలను ఏర్పాటుచేసిన ట్లు తెలిపారు. పరీక్షలు రెండుసెషన్లలో జరుగు తాయని, ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు ఫస్ట్ ఇయర్ పరీక్షలు, మధ్యా హ్నం 2.30గంటల నుంచి సాయంత్రం 5.30గం టల వరకు సెకండ్ ఇయర్ పరీక్షలు నిర్వహించను న్నట్లు పేర్కొన్నారు. పోలీస్, ఆర్టీసీ, రెవెన్యూ, పోస్టల్, మెడికల్ అండ్ హెల్త్ తదితరశాఖలు పర స్పర సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ప్రశ్నాపత్రాలను ఆయారూట్లవారీగా పోలీసు బందో బస్తు మధ్య తరలించాలని ఆదేశించారు. పరీక్షాకేం ద్రాల పరిసరాల్లో నిషేధాజ్ఞలు అమలు చేయడంతో పాటు జిరాక్స్ కేంద్రాలను మూసివేయాలని సూచిం చారు. వేసవితీవ్రతను దృష్టిలో ఉంచుకుని ప్రతి పరీక్షాకేంద్రంలో రక్షిత మంచినీటి సదుపాయం, పరిశుభ్రమైన వాతావరణం ఉండేలాచూడాలని ఆదే శించారు. అన్నిపరీక్షాకేంద్రాల్లో సిసికెమెరాలు ఏ ర్పాటుచేయాలని తెలిపారు. పరీక్షాకేంద్రాల్లోకి సెల్ ఫోన్లకు అనుమతిలేదని స్పష్టంచేశారు. విద్యార్థులు ఎలాంటి ఎలక్ట్రానిక్‌గాడ్జెట్స్ తీసుకురావద్దని స్పష్టం చేశారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఫస్ట్ ఎయిడ్ కిట్లతో ఆశావర్కర్లు, ఎఎన్ఎంలను అందుబాటులో ఉంచా లని, పరీక్షలసమయంలో విద్యుత్‌సరఫరాలో అం తరాయం లేకుండా చూడాలని సంబంధిత అధికా రులను ఆదేశించారు. విద్యార్థులకు రవాణా ఇబ్బం దులు తలెత్తకుండా పరీక్షాసమయాలకు అనుగుణం గా ప్రత్యేకబస్సులు నడపాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. విద్యార్థులు పరీక్షాసమయానికి ముం దుగానే తమకు కేటాయించిన పరీక్షాకేంద్రాలకు చేరుకోవాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ చైతన్యరెడ్డి, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి గోవిందరామ్, సంబంధితశాఖల అధికా రులు పాల్గొన్నారు.

మైనర్ బాలికపై అత్యాచారం అత్యంత ఘోరం

-బండి సంజయ్ రాజీనామా చేయాలి: ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్, మే 11, ప్రభాతవార్త:
రక్షకులే భక్షకులుగా మారిన పరిస్థితి నేడు తెలంగాణరాష్ట్రంలో కనిపిస్తుం దని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ఆవేదన వ్యక్తంచేశారు. ఈసందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర హోమ్ సహాయకశాఖ మంత్రి బండి సం జయ్ కుమారుడు బండి భగీరథ మైనర్ బాలికపై అత్యాచారం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి హోంశాఖను తన వద్దనే ఉంచుకొని పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. అత్యాచారా నికి పాల్పడ్డ బండి భగీరథను ఎందుకు అరెస్టుచేయడం లేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో క్రైమ్ రేట్స్ విపరీతంగా పెరిగిపోయాయని గుర్తుచేశారు. హోం శాఖను రివ్యూ చేయడానికి ముఖ్యమంత్రికి సమయం సరిపోవడం లేదని ఎద్దేవాచేశారు. బండి భగీరథను రాష్ట్రప్రభుత్వం రక్షించే ప్రయత్నంచేస్తుంద ని అన్నారు. పిటిషన్ ఇచ్చి 48 గంటలు అవుతున్న ఇప్పటివరకు రిమాండ్ చేయకపోవడం ఏంటని ప్రశ్నించారు. దీనికి నైతిక బాధ్యత వహించి కేంద్ర హోమ్ సహాయకశాఖ మంత్రి బండి సంజయ్ రాజీనామాచేయాలని ఆమె డిమాండ్‌చేశారు. నేరంచేసిన తనకొడుకును రక్షించుకుంటే సామాన్య ప్రజల పరిస్థితి ఏంటని దుయ్యబట్టారు. ఈ విషయంపై మహిళా మంత్రులు కొండా సురేఖ, సీతక్కలకు కళ్ళు కనబడడం లేదా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి, మంత్రులు స్పందించి బండి భగీరథను అరెస్ట్‌చేసి రిమాండ్‌కు పంపించాలని డిమాండ్‌చేశారు.

యువత స్వయం ఉపాధితో ఎదగాలి

-టిజిఐఐసి చైర్మన్ నిర్మలాజగ్గారెడ్డి


ఇండియన్ ఆయిల్ పెట్రోల్ పంపును ప్రారంభిస్తున్న దృశ్యం

సదాశివపేట, మే 11, ప్రభాతవార్త:
సదాశివపేట పట్టణంలోని నిజాంపూర్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన చిలుకూరి నరేందర్‌కు చెందిన శ్రీలక్ష్మీ ఫిల్లింగ్ స్టేషన్ ఇండియన్ ఆయిల్ పెట్రోల్‌పంపును టిజిఐఐసి చైర్మన్ నిర్మలాజగ్గారెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత ఉద్యోగాలకే పరిమితం కాకుం డా స్వయం ఉపాధి రంగంలో ముందుకురావాలని సూచించారు. కార్య క్రమంలో సిడిసి చైర్మన్ గడీల రామ్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మునిపల్లి అంజమ్మ సత్యనారాయణ, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు పట్లూరి నాగరాజు గౌడ్, మండల అధ్యక్షుడు శ్రీనివాస్, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు పారదర్శకంగా సేవలు అందిస్తాం

-సొసైటీ చైర్మన్ బాదె చంద్రం

కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న పిఎసిఎస్ చైర్మన్ బాదె చంద్రం

రామాయంపేట, మే 11, ప్రభాతవార్త:
స్థానిక ఎస్సీ కాలనీలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలుకేంద్రాన్ని సంఘం చైర్మన్ బాదె చంద్రం, మున్సిపల్ చైర్మన్ గజవాడ లావణ్యానాగరాజు సం యుక్తంగా ప్రారంభించారు. రైతులు తమధాన్యాన్ని దళారులకు అమ్మకుండా నేరుగా కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని ఈసందర్భంగా వారు సూచిం చారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు బైరం స్వప్న, పుట్టి సందీప్, దేవుని రం జిత్, కాంగ్రెస్ నాయకులు చింతల యాదగిరి, పోచమ్మల గణేష్, బైరం కుమార్‌తోపాటు రైతులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

నెరవేరుతున్న పేదల సొంతింటి కల

-నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి

పెద్దశంకరంపేట, మే 11, ప్రభాతవార్త:
ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల నెరవేరుతుందని నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. సోమవారం పెద్దశంకరంపేటతోపాటు మం డల పరిధిలోని బద్దారం గ్రామంలో లబ్ధిదారులు నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని, లబ్ధి దారులతో కలిసి గృహప్రవేశం చేయించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం విద్యావారోత్సవాల సందర్భంగా పట్టణంలోని జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల కాంపౌండ్‌వాల్ నిర్మాణానికి శంకుస్థాపనచేశారు. కార్యక్రమంలో సర్పంచ్ జంగం రేణుకశ్రీనివాస్, ఉపసర్పంచ్ రాజుగౌడ్, ఎంపిడిఓ క్రాంతికుమార్, హౌసింగ్ డిఇ ప్రసన్న, ఏఈ కౌశిక్‌రెడ్డి, ఎంఈఓ శేఖర్, నాయకులు మధు సూదన్, నారా గౌడ్, మురళిపంతులు, సుభాష్‌గౌడ్, చాకలి నారాయణ, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు పెరుమాల్‌గౌడ్, ఎంపిటి జాకీర్ హుస్సేన్, ఈవో వెంకట్ రాములు తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాలకు అతీతంగా బొల్లారం డివిజన్ అభివృద్ధి

-పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జిఎంఆర్

బొల్లారం, మే 11, ప్రభాతవార్త:
రాజకీయాలకు అతీతంగా బొల్లారం డివిజన్‌ను అన్నిరంగాల్లో అభివృద్ధికి ప్రతీకగా తీర్చిదిద్దుతున్నామని పటాన్‌చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. సోమవారం ఉదయం బొల్లారం డివిజన్ పరిధిలోని బాలాజీ నగర్, బిసికాలనీ, బీరప్పబస్తి, గాంధీనగర్, ఐడిఎకాలనీ, కెబిఆర్‌కాలనీ, లక్ష్మీ నగర్, శ్రీరామ్‌నగర్, వైఎస్ఆర్‌కాలనీలలో 19కోట్ల రూపాయలు అంచనా వ్యయంతో చేపట్టనున్న సిసిరోడ్లు, యుజిడి నిర్మాణపనులకు ఆయన శంకు స్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న బొల్లారం డివిజన్ పరిధిలోని ప్రతి కాలనీని అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా నిధులు కేటాయిస్తున్నామని తెలి పారు. కార్యక్రమంలో అమీన్పూర్‌సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ప్రదీప్‌కుమార్, మాజీ జడ్పిటిసి బాల్‌రెడ్డి, మాజీ ఎంపిపి రవీందర్‌రెడ్డి, సీనియర్ నాయకులు హనుమంత్‌రెడ్డి, చంద్రారెడ్డి, సిఐ రవీందర్‌రెడ్డి, ఈఈ సురేష్, డిఈ వెంకట రమణ, మాజీ ప్రజాప్రతినిధులు, బిఆర్ఎస్‌పార్టీ సీనియర్‌నాయకులు, కార్య కర్తలు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలపట్ల ఆసక్తి కలిగిన ఎమ్మెల్యే దొరకడం అదృష్టం

-సినీ నటుడు సుమన్

జిఎంఆర్‌తోకలిసి బహుమతులు అందజేసిన సినీనటుడు సుమన్

పటాన్‌చెరు, మే 11, ప్రభాతవార్త:
ప్రస్తుతసమాజంలో స్వీయరక్షణ కోసం విద్యార్థినిలు, మహిళలు తప్పకుండా కరాటే నేర్చుకోవాలని, దీనిద్వారా మానసిక ప్రశాంతత శారీరక దారుఢ్యత లభిస్తుందని సినీనటుడు సుమన్ అన్నారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని భారతరత్న పివి నరసింహారావు ఆడిటోరియంలో ఎమ్మెల్యే జిఎంఆర్ సౌజ న్యంతో లక్కీ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన గూడెం విష్ణువర్ధన్‌రెడ్డి స్మారక పదవ జాతీయస్థాయి కరాటే ఛాంపియన్షిప్ పోటీల ముగింపు కార్యక్రమానికి ఎమ్మెల్యే జిఎంఆర్‌తో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, కేరళ రాష్ట్రాల నుంచి క్రీడాకారులు హాజరయ్యారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి యాదగిరియాదవ్, మార్కెట్‌కమిటీ మాజీచైర్మన్ విజయ్‌కుమార్, వెంకట్‌రెడ్డి, వెంకటేష్, షకీల్, రామ్మోహన్, వినోద్‌రెడ్డి, క్రీడాకారులు పాల్గొన్నారు.

ప్రైవేట్ ఆస్పత్రిని తనిఖీ చేసిన డిఎం అండ్ హెచ్ఓ


ప్రైవేట్ ఆస్పత్రిని తనిఖీ చేస్తున్న అధికారులు

వెల్దుర్తి, మే 11, ప్రభాతవార్త:
మండల కేంద్రమైన శ్రీలక్ష్మి నర్సింగ్‌హోమ్‌ను సోమవారం తూప్రాన్ డివిజన్ డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ ఆర్‌బి.జ్ఞానేశ్వర్ సందర్శించి తనిఖీనిర్వహించారు. పిసిపిఎన్‌డిటి యాక్టులోభాగంగా ప్రైవేట్ ఆస్పత్రిలో డెలివరీలు జరుగుతున్నం దున తనిఖీచేయడం జరిగిందని స్థానిక పిహెచ్‌సి డాక్టర్ శిరీష తెలిపారు. ఈ సందర్భంగా గత మూడునెలల నుండి రెండు డెలివరీ కేసులు అయినట్లు విచారణలో తేలింది అన్నారు. అందుకు రికార్డులు నిర్వహించవలసి ఉండగా రికార్డులు సరిగా లేనందున రికార్డు సరిచేసుకోవాలని సంబంధిత నర్సింగ్ హోమ్ డాక్టర్ శ్రీకాంత్‌కు సూచించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎ. సంతోష్‌కుమార్ డిపిఎంఓ కె.కృష్ణవేణి, శోభ, శ్రీనివాస్, స్థానిక ప్రభుత్వ ఆసు పత్రి డాక్టర్ శిరీష పాల్గొన్నారు.

బీరప్ప కామారతి కళ్యాణ మహోత్సవం

-ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే చింత ప్రభాకర్

సదాశివపేట, మే 11, ప్రభాతవార్త:
మండలంలోని ఫసల్వాదిగ్రామ శివారులో నిర్వహించిన శ్రీబీరప్పస్వామికామా రతి కళ్యాణ మహోత్సవం ఘనంగా జరిగింది. ఈవేడుకల్లో సంగారెడ్డి ఎమ్మె ల్యే చింత ప్రభాకర్ పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేకపూజలు నిర్వ హించారు. ఈసందర్భంగా ఆలయకమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామా ల్లో నిర్వహించే సంప్రదాయ ఆధ్యాత్మికవేడుకలు ప్రజల్లో ఐక్యత, భక్తిభావాల ను పెంపొందిస్తాయని అన్నారు. కార్యక్రమంలో మాజీ సిడిసి చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, చింత సాయినాథ్, గ్రామ సర్పంచ్ హరిప్రసాద్, మండల పార్టీ అధ్యక్షుడు చక్రపాణి, శ్రవణ్‌రెడ్డి, వాజిత్, కౌన్సిలర్ సోమి పాల్గొన్నారు.

ప్రజోపయోగ కార్యక్రమాల్లో టిజిఐఐసి చైర్మన్

సదాశివపేట, మే 11, ప్రభాతవార్త:
తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల అమలుకుకట్టుబడి పనిచేస్తోందని టిజిఐఐసిచైర్మన్ నిర్మలాజగ్గారెడ్డి అన్నా రు. సోమవారం సదాశివపేట పట్టణం, మండలపరిధిలో నిర్వహించిన పలు ప్రజోపయోగ కార్యక్రమాల్లో ఆమె పాల్గొన్నారు. కార్యక్రమాలను పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పట్లూరి నాగరాజుగౌడ్ పర్యవేక్షించారు. అనంతరం సదాశివపేటమండలంలోని పెద్దాపూర్, ఆరూరు, ఆత్మకూరు, కంబాలపల్లి, ఎల్లారం, నాగులపల్లి, నందికంది గ్రామాల్లో మొత్తం 14 మంది లబ్ధిదారులకు రూ.5లక్షల6వేల500 సిఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను ఆయాగ్రామాల సర్పంచుల సమక్షంలో నిర్మలా జగ్గారెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమాల్లో సిడిసి చైర్మన్ రామిరెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ ప్రభు, మండలనాయకుడు చాట్ల సిద్ధన్న, మండల అధ్యక్షుడు ఒగ్గు శ్రీనివాస్, సర్పంచులు ఇందూరి భారతమ్మబాబు, విజయలక్ష్మిశివానంద్‌గౌడ్, ఉప సర్పంచ్ సందీప్, ఆత్మకూర్ గంగన్న, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

జ్యోతిబాపూలే అవార్డులు అందుకున్న విద్యార్థినులు


జ్యోతిబా పూలే అవార్డు అందుకుంటున్న మొగుడంపల్లి విద్యార్థినులు

మొగుడంపల్లి, మే 11, ప్రభాతవార్త:
మండల కేంద్రమైన మొగుడంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వతరగతిలో విద్యను అందుకుని ఇటీవల నిర్వహించిన వార్షిక పరీక్షల్లో మండలటాపర్‌గా నిలిచిన విద్యార్థికి సోమవారం హైద్రాబాద్‌లోని రవీంద్ర భారతిలో మహాత్మా జ్యోతిబాపూలే ప్రతిభా అవార్డులు అందచేశారు. పాఠశాలకు చెందిన ఎస్.అక్షయ 544 మార్కులతో మండల టాపర్‌గా నిలిచి జ్యోతిబాపూలే అవార్డును సొంతం చేసుకుంది. పాఠశాలకు చెందిన వి.నిదిక్‌చారి 543 మార్కులతో మండల ద్వితీయటాపర్‌గా, బి.నాగలక్ష్మి 542 మార్కులతో మండలస్థాయి తృతీయటాపర్‌లుగా నిలిచిన విషయం పాఠకులకు విదితమే. మండలటాపర్‌లుగా తమపాఠశాల విద్యార్థులు నిలవడంపట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశం ఆనందం వ్యక్తం చేస్తూ అందుకు కృషి చేసిన ఉపాధ్యాయులకు, సహకరించిన పోషకులకు అభినందనలు తెలుపుతూ విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.

ఉల్లాస్ లక్ష్యం అక్షరాస్యులుగా చేయడమే

కార్యక్రమంలో మాట్లాడుతున్న మెప్మా జిల్లా అధికారి హన్మంత్‌రెడ్డి

నర్సాపూర్, మే 11, ప్రభాతవార్త:
స్వయంసహాయక సంఘంలోని నిరక్షరాస్యులు అందరినీ అక్షరాస్యు లుగా చేయడమే ఉల్లాస్ ముఖ్య ఉద్దేశమని మెప్మా జిల్లా అధికారి హన్మంత్‌రెడ్డి అన్నారు. సోమవారం నర్సాపూర్ పట్టణంలోని మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ చెరుకు సాయి కుమార్ అధ్యక్షతన పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యం లో అమ్మకు అక్షరమాల కార్యక్రమాన్ని ఉల్లాస్‌ను వయోజన విద్యాశాఖ సమన్వయంతో నిర్వహించారు. ఈకార్యక్రమంలో మహిళాసమాఖ్య పదా ధికారులకు, మెప్మా రిసోర్స్‌పర్సన్లకు, సిఆర్‌పిలకు ఒక్కరోజు శిక్షణ కార్య క్రమాన్ని నిర్వహించగా, మున్సిపల్‌చైర్‌పర్సన్ లక్ష్మీరాజుయాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్ పర్సన్ మాచునూరి లక్ష్మీరాజుయాదవ్, మెప్మా పిడి హనుమంత్‌రెడ్డి, ఇంచార్జి టిఎంసి దేవపాల, మెప్మా పదాధికారులు, రిసోర్స్‌పర్సన్స్, ఎస్ ఎస్‌జి మహిళలు పాల్గొన్నారు.

50మంది చిన్నారులకు జగ్గారెడ్డి సైకిళ్లు పంపిణీ

సంగారెడ్డి బ్యూరో మే 11, ప్రభాతవార్త:
సంగారెడ్డి పట్టణంలోని 50మంది చిన్నారులకు సోమవారం సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సైకిళ్లను పంపిణీ చేశారు. ఈవేసవిసెలవుల్లో ఆరోగ్యం జాగ్రత్తగా కాపాడుకోవాలని ఈసంద ర్భంగా జగ్గారెడ్డి చిన్నారులకు సూచించారు. తమ కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకున్న చిన్నారులకు విడతలవారీగా సైకిళ్లపంపిణీ కొనసాగు తుందని ఆయన స్పష్టంచేశారు. ఇప్పటివరకు 320 సైకిళ్ల పంపిణీ పూర్త యిందని, మరో 600 సైకిళ్లు పంపిణీకోసం అవసరమైన ఏర్పాట్లు చేస్తు న్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకులు జార్జ్, చిద్రుప్ప రఘుగౌడ్, కూన సంతోష్, కిరణ్‌గౌడ్, మహేష్‌ముదిరాజ్, శ్రీ కాంత్‌గౌడ్, సుదీప్ తదితరులు పాల్గొన్నారు.

కోమటికుంట సుందరీకరణ పనులకు ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి శంకుస్థాపన

శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి తదితరులు

నర్సాపూర్, మే 11, ప్రభాతవార్త:
నర్సాపూర్ పట్టణంలోని నర్సాపూర్, తూప్రాన్ ప్రధాన రహదారి పక్కనగల కోమటికుంట సుందరీకరణ పనులకు సోమవారం ఎమ్మెల్యే సునీతారెడ్డి చేతులమీదుగా శంకుస్థాపనచేశారు. ప్రభుత్వం కోమటికుంట అభివృద్ధికి, సుందరీకరణకుగాను కోటి20లక్షలు మంజూరుచేయగా ఈ పనులను ఎమ్మెల్యే సునీతారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సాయికుమార్, బిఆర్ఎస్ నాయ కులు పాల్గొన్నారు.

పిఎసిఎస్‌లో కొలువుదీరిన నూతన పాలకవర్గం

వెల్దుర్తి, మే 11, ప్రభాతవార్త:
మండలకేంద్రమైన వెల్దుర్తిలోని పిఎసిఎస్‌లో సోమవారం నూతన పాలక వర్గాన్ని హైకోర్టు ఉత్తర్వులు మేరకు ఎన్నుకోవడం జరిగిందని పిఎసిఎస్ వెల్లడించారు. పిఎసిఎస్ చైర్మన్‌గా తిరుమల అనంతరెడ్డి, వైస్‌చైర్మన్‌గా మురళి, డైరెక్టర్లుగా రవిచంద్రగుప్త, కృష్ణగౌడ్, నర్సింలు, పోతిరెడ్డిలను ఎన్నుకోవడం జరిగిందన్నారు.

యంత్రంలో చిక్కుకుని మహిళాకూలీ మృతి

చేర్యాల, మే 11, ప్రభాతవార్త:
వడ్లు జల్లిపట్టే యంత్రంలో తల ఇరుక్కుని మహిళాకూలీ మృతిచెందిన సంఘటన చేర్యాలమండలం కాశెగుడిసెలగ్రామంలో చోటుచేసుకుంది. స్థా నికులు తెలిపిన వివరాల ప్రకారం, మండలంలోని కాశెగుడిశెలకు చెందిన షేక్ ఇమాంబీ(55) అనేమహిళ రోజులాగే ఆకునూరుశివారు కాశెగుడిశెల కు వెళ్లేమార్గంలో ప్యాడిక్లీనర్‌గా, కూలీగా వడ్లు జల్లిపట్టేందుకు వెళ్ళింది. ఆసమయంలో ప్రమాదవశాత్తు ఆమె తలవెంట్రుకలు యంత్రంలో చిక్కు కోవడంతో తలకు తీవ్రంగా గాయాలయ్యాయి. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. మృతురాలికి భర్త, నలుగురు కుమార్తెలు ఉన్నారు. కొన్ని నెలల క్రితమే ఆమె కుమారుడు కిడ్నీలు చెడిపోయి మరణించడం జరిగింది. ఆ కుటుంబంలో మరోసారి తీవ్ర విషాదం నెలకొంది.

హెచ్‌సిఎ అపరేషన్ హెడ్(క్రికెట్)గా నియమితులైన అంబటి రాయుడును మార్యద పూర్వకంగా కలిసిన మల్లికార్జున్

సమ్మర్ క్రికెట్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలి

సిద్దిపేట జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి మల్లికార్జున్

సిద్దిపేట అర్బన్, మే 11, ప్రభాతవార్త : హైదారాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆపరేషన్ హెడ్(క్రికెట్)గా నియమితులైన అంబటి రాయుడును సిద్దిపేట జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి కలకుంట్ల మల్లికార్జున్ హైదరాబాద్‌లో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణ జిల్లాల్లో క్రికెట్‌ను అభివృద్ధి చేయడానికి మీ వంతు సహకారం అందించాలని జిల్లా క్రికెట్ క్రీడాకారులకు ఎక్కువ అవకాశాలు ఇవ్వాలని కోరినట్లు కలకుంట్ల మల్లికార్జున్ తెలిపారు. మెదక్ ఉమ్మడి జిల్లా మాజీ క్రికెట్ క్రీడాకారుడు సర్వేష్‌కుమార్‌ను హైదారాబాద్ క్రికెట్ అసోసియేషన్ జూనియర్ సెలక్షన్ కమిటీ మెంబర్‌గా నియమించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ప్రొ॥జయశంకర్ స్టేడియంలో నెల రోజులపాటు అండర్-14, అండర్-16, అండర్-19, అండర్-23 బాలికల, బాలురుల సమ్మర్ క్రికెట్ క్యాంపు హైదారాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఉమ్మడి మెదక్ జిల్లా క్రికెట్ అసోసియేషన్, జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందని జిల్లా క్రికెట్ క్రీడాకారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి కలకుంట్ల మల్లికార్జున్ తెలిపారు.

వేసవి క్యాంపును విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి

మాట్లాడుతున్న సర్పంచ్ శ్రీధర్ పెద్దన్న

బెజ్జంకి, మే 11, ప్రభాతవార్త : పిల్లల్లో ఉన్న సృజానత్మకతను వెలికి తీసేందుకు ప్రత్యేక క్యాంపులు ఎంతగానో ఉపయోగపడుతాయని సర్పంచ్ బొల్లం శ్రీధర్ పెద్దన్న అన్నారు. మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో సోమవారం వేసవి కాల ప్రత్యేక క్యాంపును ఆయన ప్రారంభించి పిల్లలకు స్నాక్స్ పంపిణీచేసి మాట్లాడారు. వేసవి సెలవుల్లో సమయాన్ని వృథా చేయకుండా క్యాంపును సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రిన్సిపల్ మాలోత్ సంగీత మాట్లాడుతూ విద్యాశాఖ ఆదేశాల మేరకు ఈనెల 11 నుంచి 25వ తేదీ వరకు 11 రంగాల్లో క్యాంపును నిర్వహించడం జరుగుతుందన్నారు. 6వ తరగతి నుంచి టెన్త్ చదివే విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, స్పోకెన్ ఇంగ్లీష్, చిత్ర లేఖనం, టైలరింగ్ వంటి 11 రంగాల్లో క్యాంపు నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. ఈకార్యక్రమంలో బాలుర ఉన్నత పాఠశాల హెచ్ఎం శ్రీరాములు, వార్డు సభ్యులు ఎలిగే సతీష్, తిప్పారపు మహేష్, కనుకరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించడమే ప్రజావాణి లక్ష్యం : ఆర్డీవో

ప్రజావాణిలో ఫిర్యాదులను స్వీకరిస్తున్న ఆర్డీవో చంద్రకళ

గజ్వేల్, మే 11 (ప్రభాతవార్త): సమస్యలను పరిష్కరించడానికే ప్రతి సోమవారం ఆర్డీవో కార్యాలయంలో ప్రజావాణి ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆర్డీవో చంద్రకళ పేర్కొన్నారు. సోమవారం ఆర్డీవో కార్యాలయంలో ప్రజావాణి నిర్వహించగా పలువురు సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రాలు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆర్డీవో చంద్రకళ మాట్లాడుతూ భూసమస్యలు, పెన్షన్లు, రేషన్‌కార్డులు,ఇతర సంక్షేమ పథకాలపై వచ్చిన ఫిర్యాదులను తీసుకున్నట్లు తెలిపారు. త్వరగా సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆర్డీవో చంద్రకళ సూచించారు.

ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుకుందాం : సర్పంచ్

బందారంలో కళ ప్రదర్శన నిర్వహిస్తున్న కళాకారులు

కొండపాక, మే 11, ప్రభాతవార్త : ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా సోమవారం బందారం గ్రామంలో రోడ్డు భద్రత నియామలు, పరిసరాల పరిశుభ్రత, డ్రగ్స్,గంజాయి, ఎండకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కళ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం సర్పంచ్ గంగాధర్ పాల్గొని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడానికి అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పాలకవర్గం సభ్యులు, పంచయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు. కళ ప్రదర్శనలో కళాకారులు పిల్లుట్ల శ్యామ్‌సుందర్ టీం సభ్యులు, సనువాల కనకయ్య, గెంటె హరిప్రసాద్, పిన్నింటి రత్నం, పన్నీరు శ్రీనివాస్, ఎల్ల సిద్దులు, రాచపల్లి శైలజ తదితరులు పాల్గొన్నారు.

దేశంలో అందరూ సమానమే : తహసీల్దార్

జగదేవ్‌పూర్, మే 11 (ప్రభాతవార్త): దేశంలో అన్ని కులాల, మతాల ప్రజలు అందరూ సమానమేనని, సమానత్వం పాటిస్తూ రాజ్యాంగ విలువలను కాపాడుదామని జగదేవ్‌పూర్ తహసీల్దార్ నిర్మల అన్నారు. మండల పరిధిలోని అనంతసాగర్ గ్రామంలో ఇటీవల దుర్గమ్మ ఆలయంలోకి దళితుల బోనాలు రావద్దని కుల వివక్ష పేరుతో దూరం పెట్టిన విషయం విధితమే కాగా ఈ విషయంపై సోమవారం తహసీల్దార్ నిర్మల అనంతసాగర్ లోని దుర్గమ్మ ఆలయంలోకి ఎస్సీ కాలనీ నుండి బాధితులతో కలిసి గ్రామ పంచాయతీలోని అన్నికులాలతో ర్యాలీగా వెళ్లి ఆలయ ప్రవేశంచేసి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కులాల పేరుతో వివక్షత చూపరాదని, సమాజంలో మానవులంతా సమానమేనని, అందరూ ఐక్యంగా కలిసి ఉండడమే గ్రామ అభివృద్ధికి సాధ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ క్యాసారం కుమార్, తిమ్మాపూర్ గ్రామ సర్పంచ్ పోసాన్‌పల్లి రాజు, అనంతసాగర్ మాజీ సర్పంచ్ దండు లావణ్య మల్లేశం, గ్రామకార్యదర్శి విక్రమ్, ఆర్ఐ సత్యనారాయణ, గ్రామ జిపివో శివకుమార్, పాల్గొన్నారు.

అనంతసాగర్ ప్రజలతో కలిసి ఆలయ ప్రవేశం చేస్తున్న తహసీల్దార్ నిర్మల

అప్పుచేసి అభివృద్ధి ఏంచేశారో ప్రధాని చెప్పాలి

ఎఫ్‌డిసి మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్,మే 11(ప్రభాతవార్త): బంగారం కొనొద్దు, పెట్రోల్, డీజిల్ కోసం ప్రజలు తిరగొద్దని ప్రధాని మోడి అనడం భారతదేశానికి స్వతంత్రం వచ్చి 80 సంవత్సరాలు గడుస్తున్నా ఏ ప్రధానమంత్రి ఇలాంటి ఆంక్షలు పెట్టలేదని ఎఫ్‌డిసి మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి విమర్శించారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రధాన మంత్రి హోదాలో ఉండి అలాంటి మాటలు మాట్లాడడం సరైందికాదన్నారు. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి కుమారుని ఫోక్సో కేసు విషయంలో వెంటనే అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించాలని డిమాండ్ చేశారు. మోడి ప్రధాని అయ్యాక ఎగుమతులు తగ్గి దిగుమతులు పెరిగాయని, ఎగుమతులు చేసుకునే మొక్కజొన్న, కాటన్ దిగుమతి చేసుకునే పరిస్థితి వచ్చిందని, దానికి కారణం కేంద్రంలోని నరేంద్రమోడి ప్రభుత్వం అన్నారు. గడిచిన 12 సంవత్సరాల కాలంలో 200 లక్షల కోట్ల అప్పుచేసి ఏ అభివృద్ధి చేశారో ప్రజలకు వివరించాలన్నారు. అబద్ధపు, అసత్యపు హామీలతో అధికారం చేపట్టిన నరేంద్రమోడి ప్రభుత్వం కుబేరుల నల్లధనాన్ని స్విస్ బ్యాంకుల నుండి వెనక్కి తీసుకువచ్చి ప్రతి ఒక్కరి ఖాతాలో రూ.15 లక్షలు జమ చేస్తామని చెప్పి ఎన్ని కోట్ల మంది ఖాతాలలో రూ.15 లక్షలు జమచేశారో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. నరేంద్రమోడి, రేవంత్‌రెడ్డిల దోస్తానా ఏందో చెప్పాలని, కాంగ్రెస్ బిజెపి రెండు పార్టీలు ఒకటేనా అని ప్రశ్నించారు. బడేబాయ్ చోటబాయ్ దోస్తానా నరేంద్ర మోడి రాకతో తేటతెల్లమైందని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్, బిజెపిలను ప్రజలు బొందపెట్టడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గంగిశెట్టి చందన రవీందర్, వైస్ చైర్మన్ కళ్యాణ్‌కార్ పద్మాబాయి నర్సింగరావు, కౌన్సిలర్లు అత్తెల్లి శ్రీనివాస్, బొగ్గుల స్వప్న సురేష్, కాముని మురళి, మర్కంటి కనకసేన, కప్ప మమతా సంతోష్, గోలి సంతోష్, పట్టణ అధ్యక్షుడు నవాజ్ మీరా, మండల పార్టీ అధ్యక్షుడు బెండె మధు, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ ఊడెం కృష్ణారెడ్డి, మాజీ జెడ్‌పిటిసి బొల్లారం ఎల్లయ్య, కిష్టాపూర్ మాజీ సర్పంచ్ ప్రతాప్‌రెడ్డి, నాయకులు భీమప్ప, అహ్మద్, యువజన విభాగం అధ్యక్షుడు స్వామి చారి, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

బండి సంజయ్‌కు రేవంత్ సర్కార్ అండ

మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్

హుస్నాబాద్ రూరల్, మే 11, ప్రభాతవార్త : కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్‌కు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తూ, ఆయన కుమారుడు భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసును నీరుగార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్‌కుమార్ ఆరోపించారు. సోమవారం హుస్నాబాద్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మైనర్ బాలికలపై అఘాయిత్యాలకు పాల్పడ్డాడన్న ఆరోపణలతో భగీరథ్‌పై ఎఫ్ఐఆర్ నమోదుచేసి మూడు రోజులు గడిచినా ఇప్పటివరకు అరెస్టు చేయకపోవడంపై ఆయన ప్రశ్నించారు. హోం మంత్రిగా ఉన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలతోనే పోలీసులు అరెస్టు చేయడంలో జాప్యం చేస్తున్నారని ఆరోపించారు. ఫిర్యాదు చేసిన బాలికతో పాటు ఆమె కుటుంబ సభ్యులను పోలీసులు బెదిరిస్తున్నారని, పోక్సో కేసు కాకుండా సాధారణ కేసుగా మార్చి వ్యవహారాన్ని నిర్వీర్యం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. మంత్రుల కొడుకులకు ఒక న్యాయం, ఇతరులకు మరో న్యాయమా అని ప్రశ్నించారు. భగీరథ్‌ను వెంటనే అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించాలని, అలాగే కేంద్ర మంత్రిగా ఉన్న బండి సంజయ్‌ను పదవి నుంచి బర్తరఫ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేదంటే చట్టాలపై ప్రజలకు ఉన్న నమ్మకం దెబ్బతింటుందన్నారు. పోలీసులు తమ విధులను నిష్పక్షపాతంగా నిర్వహించాలని కోరిన ఆయన, భగీరథ్ కేసులో ఇంకా జాప్యం కొనసాగితే బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

రోడ్లపై ధాన్యం ఆరబెట్టొద్దు : ఎస్ఐ

మర్కుక్, మే 11 (ప్రభాతవార్త): రోడ్లపై ధాన్యాన్ని రైతులు ఆరబెట్టకూడదని ఎస్ఐ దామోదర్ హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన వరిని రోడ్లపై ఆరబెట్టడంతో రాత్రి వేళలో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. రైతులు రోడ్లపై పోయకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ధాన్యం కుప్పల వల్ల ప్రమాదం జరిగితే ధాన్యం పోసిన రైతుపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

అనుమతి లేని వెంచర్లపై చర్యలు తీసుకోవాలి

సంగారెడ్డి మున్సిపాలిటీ మే 11, ప్రభాతవార్త : జిల్లాలో అక్రమ, అనుమతి లేని ఫామ్ ల్యాండ్, వెంచర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని సోమవారం సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్లో నిర్వహించిన ప్రజావాణిలో ఫిర్యాదు చేసినట్లు సంగారెడ్డి జిల్లా ఆమ్ ఆద్మీ పార్టీ అధ్యక్షులు మిట్టపల్లి రాజేశ్వర్ తెలిపారు. డబ్బులు వెచ్చించి ప్లాట్లు కొంటున్న ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అధికారులు తగులు చర్యలు తీసుకోవాలని ఆయన ఫిర్యాదులు కోరారు.

విద్యార్థుల్లో నైపుణ్యాలను వెలికితీయడమే

సమ్మర్ క్యాంప్ ఉద్దేశం : ఎమ్మెల్యే

నారాయణఖేడ్, మే 11 ప్రభాతవార్త : విద్యా వారోత్సవాలలో భాగంగా ఏర్పాటు చేసిన "సమ్మర్ క్యాంప్ 2026"ను ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల్లో నైపుణ్యాలను వెలికితీయడమే సమ్మర్ క్యాంప్ ఉద్దేశం అని అన్నారు. వేసవి సెలవులను విద్యార్థులు ఆటపాటలకే పరిమితం చేయకుండా, వారిలో దాగి ఉన్న సృజనాత్మకతను, విజ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి ఈ సమ్మర్ క్యాంప్ ఒక అద్భుతమైన వేదిక అని తెలిపారు. సమ్మర్ క్యాంప్‌లో ప్రధానంగా నాలుగు అంశాలపై దృష్టి సారించినట్లు ఎమ్మెల్యే వివరించారు. ఒత్తిడి లేని వాతావరణంలో ఆటపాటల ద్వారా విద్యార్థులను ఉత్సాహపరచడం, పాఠ్య పుస్తకాలకు ఆవల ఉన్న సరికొత్త విషయాలను, జీవన నైపుణ్యాలను నేర్చుకోవడం, విద్యార్థులు తమ చుట్టూ ఉన్న ప్రపంచాన్ని, విజ్ఞాన శాస్త్రాన్ని కొత్త కోణంలో అన్వేషించేలా ప్రోత్సహించడం, శారీరక, మానసిక మరియు మేధోపరమైన అభివృద్ధి సాధించి ఉత్తమ పౌరులుగా ఎదగడం, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన విద్యా వారోత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్ సెట్, రుక్మిణి గోపాల్‌రెడ్డి, షారుఖాన్ మహేష్‌చౌహాన్, కౌన్సిలర్లు, పండరిరెడ్డి మాజీ ఎంపీటీసీ, ప్రజాప్రతినిధులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

చేబర్తిలో నూతన బోరు వేయిస్తున్న సర్పంచ్ ర్యాకం యాదగిరి

గ్రామంలో తాగునీటి సమస్యకు పరిష్కారం : సర్పంచ్

మర్కుక్, మే 11 (ప్రభాతవార్త): తీవ్ర నీటి ఎద్దడితో ఇబ్బంది పడుతున్న ప్రజలకు శాశ్వత పరిష్కారం కోసం బోరు వేయించినట్లు సర్పంచ్ ర్యాకం యాదగిరి తెలిపారు. సోమవారం మండల పరిధిలోని చేబర్తిలో సర్పంచ్ యాదగిరి ఆధ్వర్యంలో బోరు వేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో తాగునీటి సమస్య ఉండవద్దనే ఉద్దేశంతో బోరు వేయించామని, అలాగే గ్రామాభివృద్దే లక్ష్యంగా ముందుకు సాగుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ పాలకవర్గ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మతసామరస్యాలకు ప్రతీక ఎర్రవల్లి

-మాలధారణ స్వాములకు బిక్ష పెట్టిన ముస్లిం యువకుడు

మర్కుక్, మే 11 (ప్రభాతవార్త): హనుమాన్ మాలధారణ స్వాములు నిత్యం మధ్యాహ్నం బిక్ష చేయాల్సి వుంటుంది. వారం రోజులుగా గ్రామంలో స్వాములకు బిక్ష పెడుతున్నారు. విషయం తెలుసుకున్న ముస్లీం యువకుడు అజీజ్‌పాషా మాలధారణలో ఉన్న స్వాములకు తనవంతుగా బిక్ష పెట్టాలనుకున్నాడు. సోమవారం చివరి రోజు కావడంతో గ్రామంలోని హనుమాన్ దేవాలయం వద్ద స్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ముస్లీం యువకుడు ఏర్పాటుచేసిన బిక్షను భుజించారు. ముస్లిం యువకుడు ఇచ్చిన తాంబూలాన్ని స్వీకరించారు.ఎర్రవల్లి గ్రామంలో హిందూ, ముస్లిం, క్రిస్టియన్ అనే తేడా లేకుండా గ్రామం అంతా ఐక్యతగా ఉంటూ ప్రతి పండుగలకు ప్రతి ఒక్కరు కలుస్తున్నారు. అజీజ్‌పాషా తన మతాన్ని పక్కన పెట్టి అన్ని మతాలు సమానమేనని స్వాములకు బిక్ష పెట్టడం అభినందనీయమని గ్రామస్తులు కొనియాడారు. గ్రామస్తులంతా ఇదే ఐక్యతతో కులమతాలకు అతీతంగా కలిసి ఉండి పండుగలు చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని సర్పంచ్ కవిత రామెహన్‌రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ స్వాములు, గ్రామస్తులు, నాయకులు మొండి బిక్షపతి, చిన్నా తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం సేకరించాలి

ఎంపిడివో షాజీలొద్దిన్

రామాయంపేట, మే 11, ప్రభాతవార్త : మండల పరిధిలోని అక్కనపేట మరియు ఝాన్సీ లింగాపూర్ ధాన్యం సేకరణ కేంద్రాలను సోమవారం నాడు ఎంపీడీవో షాజీలొద్దీన్ ఆయా గ్రామ సర్పంచ్‌లు మానెగల్ల రామకిష్టయ్య, యాదగిరి, పంచాయతీ కార్యదర్శులతో కలిసి సందర్శించారు. కేంద్రాలలో జరుగుతున్న ధాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ధాన్యం సేకరణలో లారీలు, కూలీల కొరత వంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. రైతులు తీసుకువచ్చిన ధాన్యాన్ని ఆలస్యం చేయకుండా వెంటనే కొనుగోలు చేసి మిల్లులకు తరలించే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రభుత్వం రైతుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని, రైతులు కూడా నాణ్యమైన ధాన్యాన్ని సేకరణ కేంద్రాలకు తీసుకురావాలని కోరారు. కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా, వేగవంతంగా నిర్వహించాలని కేంద్రాల నిర్వాహకులకు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అక్కన్నపేట గ్రామ కార్యదర్శి సరిత తదితరులు పాల్గొన్నారు.

నందికందిలో సమ్మర్ క్యాంప్ ప్రారంభం

సదాశివపేట మే 11 ప్రభాతవార్త : జడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాల నందికందిలో గ్రామ సర్పంచ్ స్రవంతి విజయ భాస్కర్ రెడ్డి మరియు మండల విద్యాశాఖాధికారి శంకర్ సార్ ఆధ్వర్యంలో సోమవారం సమ్మర్ క్యాంప్‌ను ఘనంగా ప్రారంభించారు. విద్యార్థుల్లో సృజనాత్మకత, వ్యక్తిత్వ వికాసం పెంపొందించేందుకు ఈ సమ్మర్ క్యాంప్‌ను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో 6వ తరగతి నుండి 9వ తరగతి వరకు విద్యార్థులకు మ్యూజిక్, డాన్స్, ఆర్ట్ అండ్ కల్చరల్ కార్యక్రమాలు, యోగా, కంప్యూటర్ శిక్షణ, ఇండోర్ గేమ్స్, పర్సనాలిటీ డెవలప్మెంట్, మోడల్స్ ప్రిపరేషన్ తదితర అంశాల్లో శిక్షణ అందించనున్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ శివరాములు, చైర్మన్ జ్యోతి, ప్రధానోపాధ్యాయులు వినయకుమార్, ఉపాధ్యాయ బృందం, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు మరియు విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని సమ్మర్ క్యాంప్‌ను విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

రైతులను పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం

బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లిఖార్జున్‌రెడ్డి

హుస్నాబాద్ టౌన్, మే 11, ప్రభాతవార్త

రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం నిలువునా ముంచుతుందని బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లిఖార్జున్‌రెడ్డి విమర్శించారు. బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం హుస్నాబాద్ మండలం పందిల్లా రైస్ మిల్లులో ధాన్యం అన్‌లోడింగ్ సమస్యలు, ధాన్యం తరుగు అంశాలపై పరిశీలన నిర్వహించి రైస్ మిల్లర్లతో చర్చించిన అనంతరం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రైస్ మిల్లర్లు రైతులను నిలువునా ముంచుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టింపులేదని ఆరోపించారు. రైతులు కష్టపడి పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకెళ్తే అడుగడుగునా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కొనుగోళ్లు వేగంగా జరగకపోవడంతో రైతులు రోజుల తరబడి వేచి చూడాల్సి వస్తోందని, ధాన్యం కాంటాలు పూర్తయి రైస్ మిల్లులకు చేరిన తర్వాత కూడా ఏ గ్రేడ్, బీ గ్రేడ్ అనే తేడా లేకుండా మొత్తం కామన్ గ్రేడ్ కింద కొనుగోలుచేసి తరుగు తీస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం ఏ గ్రేడ్, బీ గ్రేడ్ విధానం తీసుకొచ్చినా, మిల్లర్లు మాత్రం మొత్తం కామన్ గ్రేడ్‌గా తీసుకుంటూ రైతులను నష్టపరుస్తున్నారు. దీనిపై ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల ప్రభుత్వం అని చెప్పుకుంటూ ప్రచారం చేసుకోవడం తప్ప రైతులకు న్యాయంచేయడంలో విఫలమైందని ఆరోపించారు. కనీసం నాణ్యమైన గన్నీ సంచులు కూడా అందించలేని పరిస్థితి నెలకొందని విమర్శించారు. ధాన్యం ఆన్‌లోడింగ్‌లో తీవ్ర ఆలస్యం జరుగుతుండడంతో ట్రాక్టర్ డ్రైవర్లు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం రైతుల సమస్యలను గుర్తించి తక్షణ చర్యలు తీసుకుని న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు యాస శ్రీనివాస్, గాల్ రెడ్డి తదితర నాయకులు, రైతులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మల్లిఖార్జునరెడ్డి

మంగోల్‌లో ధాన్యం తేమ శాతాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ సుజాత

రైతులకు ఇబ్బందులు కలిగించొద్దు : తహసీల్దార్

కొండపాక, మే 11, ప్రభాతవార్త : రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జి చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ దండి సుజాత సూచించారు. కుకునూరుపల్లి మండల పరిధిలోని మంగోల్, తిప్పారం గ్రామాల్లో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి రైతులు తీసుకురాగానే తడవకుండా చూసుకోవాల్సి బాధ్యత ఇన్‌చార్జిపై ఉంటుందన్నారు. కొనుగోలు కేంద్రంలో ఏమైనా ఇబ్బందులుంటే తన దృష్టికి తీసుకురావాలని ఆమె సూచించారు. కొనుగోలు కేంద్రంలోకి రైతులు ఎంత ధాన్యం తెచ్చారు. మీరు ఎంత ధాన్యం కొనుగోలు చేశారు. ఇప్పటి వరకు ఎన్ని లారీల ధాన్యం రైస్ మిల్లులకు తరలించారని ఆమె అడిగి తెలుసుకున్నారు. ఎక్కడైనా హమాలీ ఇబ్బందులుంటే వెంటనే పరిష్కరించుకోవాలన్నారు. అంతకు ముందు ధాన్యం తెమ శాతాన్ని పరిశీలించారు. తెమ శాతం చూసి ఎఈఒలు సర్టిఫైడ్ చేసిన దాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని అమె సూచించారు. రైతులను ఇబ్బందులకు గురి చేయకుండా ప్రతి ఒక్కరు సహకరించాలని అమె కోరారు.

వైభవంగా నాభిశిల ప్రతిష్ట మహోత్సవం

కొండపాక, మే 11, ప్రభాతవార్త : కుకునూరుపల్లి మండల కేంద్రంలో నూతన గ్రామ బొడ్రయి(నాభిశిల) పండుగ మహోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమాలు సర్పంచ్ మల్లం కనకవ్వ ఐలయ్య అధ్వర్యంలో గ్రామ అర్చకులు, వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య నాభిశిల ప్రతిష్ట కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ప్రత్యేక అహ్వానితులుగా పాండురంగ అశ్రమ గురువు సమక్షంలో యంత్ర ప్రతిష్ట మహోత్సవం వైభవోపేతంగా నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామంలోని అన్ని కులాల కుల పెద్దలు, ఉప సర్పంచ్ దొంతి సత్తయ్య, పిఎసిఎస్ వైస్ చైర్మన్ అమరేందర్, వార్డు సభ్యులు, మాజీ సర్పంచులు కాచం నవీన్ కుమార్, ఐలం శివ, మాజీ ఎంపిటిసీ భూరమైన భూములు గౌడ్, నాయకులు, కనకయ్య, నరేందర్ బొడ్రాయి ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొని పూతలింగ స్వామి ప్రతిష్టా మహోత్సవం నిర్వహించారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

కొమురవెల్లి, మే 11, ప్రభాతవార్త : గ్రామంలో మహిళ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్మించనున్న కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయ (కేజీబీవీ) కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులను సోమవారం జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి ప్రారంభించారు. నిర్మాణ పనులను నాబార్డ్ ఆర్ఐడిఎఫ్-ఎక్స్ఎక్స్ఐఎక్స్ నిధులు రూ.42.125 లక్షల అంచనా వ్యయంతో నిర్మించడం జరుగుతుందని అధికారులు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ బాలికల విద్యాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. పనులు నాణ్యతతో వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ గొల్లపల్లి పద్మ, అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

బండి సాయి భగీరథను అరెస్టు చేయాలి

కొమురవెల్లి, మే 11, ప్రభాతవార్త : కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి సాయిభగీరథపై ఫోక్సో చట్టం కింద కేసు నమోదైనప్పటికీ ఇప్పటివరకు చర్యలు తీసుకోకుండా పోలీసు వ్యవస్థ వ్యవహరిస్తుందని బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం పార్టీ మండల అధ్యక్షుడు గీస బిక్షపతి, మాజీ వైస్ ఎంపిపి కాయిత రాజేందర్‌రెడ్డి, ఉప సర్పంచ్ పోతుగంటి శ్రీనివాస్, మాజీ సర్పంచ్‌లు విజేందర్, సార్ల కిష్టయ్య, నాయకులు గొల్లపల్లి కిష్టయ్య, ముత్యం నర్సింలు మాట్లాడుతూ సాధారణ ప్రజలపై కేసులు నమోదైతే వెంటనే చర్యలు తీసుకునే పోలీసులు అధికార పార్టీ నాయకుల కుటుంబ సభ్యుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం దురదృష్టకరమన్నారు. ఫోక్సో చట్టం కింద కేసు నమోదైన నేపథ్యంలో ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు లోనుకాకుండా నిష్పక్షపాతంగా విచారణ జరిపి బండి సాయి భగీరథను తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. చట్టం ముందు అందరూ సమానమనే భావన ప్రజల్లో కలగాలంటే ప్రభుత్వం, పోలీసుశాఖ పారదర్శకంగా వ్యవహారించాలన్నారు. బాధితులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య : తహసీల్దార్

చిన్నకోడూరు, మే 11, ప్రభాతవార్త : ప్రభుత్వ కళాశాలలు, పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని పేద విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సలీం మియా అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా సోమవారం చిన్నకోడూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఐఎఫ్‌బిఎస్/ఐడిపిఎస్ ఆవిష్కరణ చేసి ప్రారంభించి మాట్లాడారు. క్రమ శిక్షణ పట్టుదల, ఇష్టంతో చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని త అన్నారు. విద్యార్థులకు పోటీ పరీక్షల్లో ఐఐటి నీట్ జేఈఈ ఎంసెట్ లాంటి పోటీ పరీక్షల్లో విజయం సాధించేందుకు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్‌రెడ్డి, ఇంటర్ బోర్డు కమిషనర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే మండల పరిధిలోని ఇబ్రహీంనగర్ ఆదర్శ పాఠశాలలో వేసవి శిక్షణ శిబిరాన్ని ప్రిన్సిపల్ సతీష్‌కుమార్, ఎంఈవో తిరుపతి పాల్గొని ప్రారంభించారు. వివిధ రంగాల్లో శిబిరంలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్, ఉప సర్పంచ్ కర్ణ కన్నారెడ్డి, ఆధ్యాపకులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పాములపర్తిలో సమ్మర్ క్యాంపు ప్రారంభం

మర్కుక్, మే 11 (ప్రభాతవార్త): మండల పరిధిలోని పాములపర్తి పిఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన సమ్మర్ క్యాంపును సోమవారం సర్పంచ్ భవాని బాలకిషన్, ఎంఈవో ఉదయభాస్కర్‌రెడ్డిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ఈ సమ్మర్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు కొనసాగుతుందని, ఈ సమయంలో విద్యార్థులకు అల్పాహారం ఏర్పాటు చేశామని తెలిపారు. విద్యార్థులలో దాగివున్న నైపుణ్యాలను పెంపొందించుకోవడం కోసం ఈ సమ్మర్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఏపిసి చైర్మన్ కనకమ్మ, ఉపసర్పంచ్ సుధాకర్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు వెంకటేశం, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్.కె.లతీసైదా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పాములపర్తి పాఠశాలలో సమ్మర్ క్యాంపును ప్రారంభించిన దృశ్యం

మండలంలో ప్రారంభమైన ఇళ్లగణన

గృహగణన కార్యక్రమం నిర్వహిస్తున్న ఎన్యూమరేటర్లు

మొగుడంపల్లి, మే 11, ప్రభాతవార్త:

మండలకేంద్రమైన మొగుడంపల్లితోపాటు మండలంలోని ఆయా గ్రామాల్లో సోమవారం గృహగణన కార్యక్రమాన్ని ఎన్యూమరేటర్లు ప్రారంభించారు. తహసీల్దార్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో డిప్యూటీ తహసీల్దార్ జుబేర్ పర్యవేక్షణలో 57 మంది ఎన్యూమరేటర్లు, 10 మంది సూపర్‌వైజర్లు ఇంటింటికి చేరుకుని వివరాలను నమోదుచేస్తున్నారు. గ్రామంలోని ప్రతి ఇంటికి ప్రత్యేక నంబర్ కేటాయించి కుటుంబసభ్యుల వివరాలు, గృహవసతులు, తదితర సమాచారం సేకరిస్తున్నారు. జూన్ 9వ తారీఖు వరకు కొనసాగనున్న గృహగణన ప్రభుత్వ సంక్షేమకథకాల అమలుకు ఉపయోగపడుతుందని అధికారులు పేర్కొంటున్నారు.

మండలంలో ప్రారంభమైన గృహగణన

గృహగణన నమోదు చేస్తున్న ఎన్యూమరేటర్లు

న్యాల్‌కల్, మే 11, ప్రభాతవార్త:

మండల కేంద్రమైన న్యాల్‌కల్‌తో పాటు మండలంలోని ఆయాగ్రామాల్లో జనాభాగణనను పురస్కరించుకుని సోమవారం ఎన్యూమరేటర్లు గృహగణన నమోదు కార్యక్రమానికి శ్రీకారంచుట్టారు. జనాభాగణన చేసేందుకు 15 మంది సూపర్‌వైజర్లకు, 92 మంది ఎన్యూమరేటర్లకు మండల కేంద్రమైన న్యాల్‌కల్‌లోని మండలపరిషత్ కార్యాలయంలో శిక్షణ ఇచ్చిన విషయం పాఠకులకు విదితమే. శిక్షణ అందుకున్న సూపర్‌వైజర్లు, ఎన్యూమరేటర్లు ఆయాగ్రామాల్లో మొదటి గృహగణనచేసి జనాభాగణన చేయనున్నారు. జనాభాగణనతో కలిగే ప్రయోజనాలపై వారు ప్రజలకు వివరిస్తున్నారు.

పిఎంశ్రీ జడ్పిహెచ్ఎస్ కాళ్లకల్‌లో ఉచిత సమ్మర్‌క్యాంప్



ఉచిత సమ్మర్ క్యాంపును ప్రారంభిస్తున్న అధికారులు

మనోహరాబాద్, మే 11, ప్రభాతవార్త:

ప్రజాపాలన ప్రగతిప్రణాళిక 99రోజుల కార్యాచరణలో భాగంగా నిర్వహిస్తున్న ఎడ్యుకేషన్ వీక్ ఈ నెల 11వ తేది నుంచి 17వ తేది వరకు పిఎంశ్రీ జడ్పిహెచ్ఎస్ కాళ్లకల్‌లో ఉచిత సమ్మర్ క్యాంప్‌ను సోమవారం ఉదయం 9:30 గంటలకు ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఉపసర్పంచ్ వీరబోయిన ప్రవీణ్‌కుమార్, మనోహరాబాద్ మండల విద్యాధికారి వెంకట స్వామి ముఖ్యఅతిథులుగా హాజరై క్యాంప్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు అతిథుల చేతులమీదుగా ఉచిత నోటుబుక్స్, పెన్నులు పంపిణీచేశారు. అనంతరం విద్యార్థులకు అల్పాహారంకూడా అందజేశారు. 6నుంచి 9వ తరగతుల విద్యార్థులు తల్లిదండ్రుల సమ్మతితో ఈ క్యాంప్‌లోచేరినట్లు తెలిపారు. కార్యక్రమంలో సుమారు100మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు, వార్డుసభ్యులు శ్రీశైలం, సాయంబాబు, సత్యనారాయణ, ఎఎపిసి చైర్‌పర్సన్ శ్రీమతి ఖైరున్నిసా పాల్గొన్నారు.

బోధనా పద్ధతులపై గీతంలో శిక్షణ

పటాన్‌చెరు, మే 11, ప్రభాతవార్త:

హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్‌లోని, భౌతికశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో అధునాతన భావనలు, బోధనా పద్ధతులు, విద్యా సాధనాల్లు అనే అంశంపై భౌతికశాస్త్ర ఉపాధ్యాయులకు మూడు రోజుల రెసిడెన్షియల్ వృత్తివికాస కార్యక్రమాన్ని జూన్ 1నుంచి 3వతేదీవరకు నిర్వహించనున్నారు. ఇండియన్ ఫిజిక్స్ అసోసియేట్ విశాఖ చాప్టర్ సహకారంతో, గీతం స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ భాగస్వామ్యంతో దీనిని ఏర్పాటు చేస్తున్నారు. ఈ శిక్షణా కార్యక్రమంలో గీతం సైన్సెస్ డీన్ ప్రొఫెసర్ ఎస్.అనంత రామకృష్ణ; విశిష్ట విజిటింగ్ ఆచార్యుడు ప్రొఫెసర్ బి.వి.ఆర్. టాటా; ఐఐటీ మద్రాసు ఆచార్యుడు ప్రొఫెసర్ టి.ఎస్. నటరాజన్; బెంగళూరులోని ఐఐఎస్ సీకి చెందిన ప్రొఫెసర్ విబోర్ సింగ్ వంటి నిపుణులు పాల్గొంటారు. అలాగే గీతం విశిష్ట ఆచార్యుడు ప్రొఫెసర్ జి.రవికుమార్, బాబా అణుశక్తి సంస్థ పూర్వ శాస్త్రవేత్త ప్రొఫెసర్ జి.ఎ.రామారావు, మోలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం ఆచార్యులు ప్రొఫెసర్ వనజ, ముంబైలోని టాటా ప్రాథమిక పరిశోధనాసంస్థ, హోమీ బాబా విద్యాసంస్థకు చెందిన ప్రొఫెసర్ దీపాచారి తదితరులు మార్గదర్శనం చేయనున్నారు. ఈ కార్యక్రమాన్ని డాక్టర్ జి.సాయిప్రీతి, డాక్టర్ టి.విశ్వం సమన్వయం చేస్తున్నారు. ఆసక్తి ఉన్నవారు తమపేర్ల నమోదు, ఇతరత్రా వివరాల కోసం కార్యక్రమ సమన్వయకర్తలు షామాబీ (77802 74121) లేదా గోపీకృష్ణ (87120 18815) లను సంప్రతించవచ్చు.

చంద్రుతాండ రైతుల ఆవేదన

-గంగన్న కుంటను కాపాడాలని తహసీల్దార్‌కు వినతి

వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

టేక్మాల్, మే 11, ప్రభాతవార్త:

టేక్మాల్ మండల పరిధిలోని చంద్రుతాండలో చెరువు కబ్జాకు గురైందని సోమవారం ప్రజావాణిలో తాండ రైతులు తహసీల్దార్ తులసిరామ్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. చంద్రుతాండ పరిధిలోని గంగన్నకుంట చెరువు శిఖం భూమిని కొందరు వ్యక్తులు కబ్జాచేసి ఆభూమిలో పంటలు సాగుచేసుకుంటున్నారని ఆరోపించారు. సుమారు 8ఎకరాల 12గుంటల విస్తీర్ణంగల చెరువును కబ్జాచేసి 1 ఎకరంన్నర భూమిని చెరువుగా మిగిల్చారని రైతులు ఆవేదన చెందారు. 2006లో ప్రభుత్వ అధికారులు చేసిన సర్వేలో చెరువు 8.12 గుంటలు ఉందని నిర్ధారించారు. అయితే కొందరు వ్యక్తులు చెరువును వారి ఇష్టారాజ్యంగా వ్యవహరించి చెరువును కబ్జాచేశారని వారు పేర్కొన్నారు. ఇదే విషయమై మార్చ్ నెలలో కలెక్టర్‌కు తాండ రైతులు ప్రజావాణిలో ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు. ఫిర్యాదు అనంతరం సర్వే అధికారులు, కలెక్టర్ ఆదేశాలతో చెరువును సర్వే చెయ్యడానికి వెళ్లగా ఆ భూమిలో వరిపంట ఉన్నందున పంటకోత అనంతరం సర్వేచేస్తామని అధికారులు రైతులకు హామీ ఇచ్చారు. చెరువు కబ్జాకు గురికావడం వల్ల చెరువులో నీరు నిలువ లేక పశువులు, పంటచెరువుకింద పంటలు సాగుచేసే రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇప్పుడు ఆ పంట కోతకోయడం జరిగిందని చెరువును సర్వేచేయించి కబ్జా కోరల్లో చిక్కుకున్న ప్రభుత్వ చెరువును కాపాడి చెరువు హద్దులను గుర్తించి తాండ ప్రజల సమస్యను పరిష్కరించాలని రైతులు తహసీల్దార్‌ను కోరారు. కార్యక్రమంలో లక్ష్మణ్ తాండ నాయకుడు కాట్రోత్ విట్టల్‌నాయక్, మాజీ ఎంపిటిసి మోహన్, వార్డ్‌మెంబర్‌లు దశరథ్, నరేందర్, గేమ్యాలాల్, చందర్, నిఖిల్, చంద్రుతోపాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

వరికొయ్యలను కాల్చితే భూమిలో తేమశాతం తగ్గుతుంది

-రైతులకు శాస్త్రవేత్తలు వ్యవసాయ అధికారులు సూచన

రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

చిలిపిచెడ్, మే 11, ప్రభాతవార్త:

వరికొయ్యలను కాల్చితే భూమిలో తేమశాతం తగ్గుతుందని రైతులకు శాస్త్రవేత్తలు వ్యవసాయ అధికారులు సూచన చేశారు. సోమవారం చిలిపిచెడ్ మండలంలోని ఫైజాబాద్ గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ అగ్రికల్చరల్ యూనివర్సిటీ రైతుముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈసందర్భంగా డా.ఎవి.రామాంజనేయులు (ప్రధాన శాస్త్రవేత్త) మాట్లాడుతూ.. చాలామంది రైతులు వరి పంటను కోసిన తర్వాత ఆభూమిలో ఉన్న కీటకాలు, హానికర సూక్ష్మజీవులు చనిపోతాయన్న అపోహతో వరికొయ్యలకు నిప్పు పెడుతున్నారు. ఇది పర్యావరణానికి అత్యంత ముప్పు. అంతేకాకుండా నిప్పుపెట్టడం మూలంగా నేలలో తేమశాతం తగ్గి పంట దిగుబడులపై ప్రభావం చూపుతుంది. కాబట్టి వరికొయ్యలను నిప్పు పెట్టకుండా భూమిలో కలియదున్నడంమూలంగా అందులో ఉన్న పోషకాలు భూమిని చేరి పంట దిగుబడిని పెంచడం ముఖ్యపాత్ర పోషిస్తాయి. కార్యక్రమంలో ఎఈఒ అనిత, టి.రామయ్య, సర్పంచ్ రాములు, ఫైజాబాద్ గ్రామ రైతులు గోపాల్‌రావు, సంగయ్య, శ్రీశైలం, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే సాంతింటి కల సాకారం

ఇందిరమ్మ ఇంటిని ప్రారంభిస్తున్న గ్రంథాలయ చైర్మన్ సుహాసినిరెడ్డి

చిలిపిచెడ్, మే 11, ప్రభాతవార్త:

చిలిపిచెడ్ పరిధిలోని ఫైజాబాద్ గ్రామంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇల్లు పథకం కింద మంజూరైన లబ్ధిదారులు ముప్పారం కిష్టయ్య స్వరూప, నూతన గృహప్రవేశ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా పాల్గొని నూతన గృహాన్ని మెదక్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చిలుముల సుహాసినిరెడ్డి ప్రారంభించారు. అనంతరం లబ్ధిదారులను షాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేసారు. ఈసందర్భంగా లబ్ధిదారులు సొంత ఇంటికలను నెరవేర్చిన ప్రజాప్రభుత్వానికి ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకులు బుచ్చిరెడ్డి, ఇందిరమ్మ కమిటీ అధ్యక్షులు గానోరే నాగేష్, ప్రవీణ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, బండపోతుగల్ ఉపసర్పంచ్ మందపురం గోపాల్, సుధాకర్, మండల యూత్‌కాంగ్రెస్ ఉపాధ్యక్షులు దొబ్బల రాజు, వార్డు సభ్యులు వంజరి రాజు, కాంగ్రెస్‌నాయకులు మ్యాకల రవి, శారీగారి మల్లేశం, గోవర్ధన్, సునీల్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

కెజిబివిలో అదనపు గదుల నిర్మాణానికి శ్రీకారం

-పనుల నిర్మాణానికి శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే సంజీవరెడ్డి



వుల్‌కుర్తి కెజిబివిలో అదనపు గదుల నిర్మాణానికి శ్రీకారం చుడుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

మనూర్, మే 11, ప్రభాతవార్త:

మండలపరిధిలోని వుల్‌కుర్తిలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో అదనపు గదుల నిర్మాణానికి 44లక్షల రూపాయలు మంజూరు కావడంతో ప్రజాపాలన - ప్రగతిప్రణాళిక కార్యక్రమంలో భాగంగా విద్యా వారోత్సవాలను పురస్కరించుకుని సోమవారం ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి భూమిపూజా కార్యక్రమాలు నిర్వహించి పనుల నిర్మాణానికి శ్రీకారంచుట్టారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో విద్యారంగ బలోపేతమే లక్ష్యంగా ముందుకుసాగుతున్నామన్నారు. ప్రభుత్వపాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీటవేస్తోందని గుర్తుచేశారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడలు, ఇతర నైపుణ్యాల్లో రాణించాలని సూచించారు. బాలికల విద్యకు ప్రాధాన్యత ఇస్తూ కెజిబివి లాంటి సంస్థలను మరింత బలోపేతంచేస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి శెట్కార్ రాజశేఖర్, కెజిబివి ప్రిన్సిపాల్ రాజేశ్వరి, సర్పంచ్ తుకారం, ఆయాశాఖల అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు, కాంగ్రెస్‌పార్టీ నాయకులు పాల్గొన్నారు.

విద్యా సంస్థల బలోపేతానికి ప్రభుత్వం కృషి...

మండల కేంద్రమైన మనూర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రజాపాలన-ప్రగతిప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన విద్యా వారోత్సవాలను పురస్కరించుకుని సోమవారం కళాశాలకు మంజూరైన ఎల్‌ఈడి టివిలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని సూచించారు. గ్రామీణప్రాంత విద్యార్థులకు కార్పొరేట్‌స్థాయి విద్యను అందించాలనే సంకల్పంతో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో డిజిటల్‌పరికరాలను ఏర్పాటుచేస్తోందని గుర్తుచేశారు. కార్యక్రమంలో యూత్‌కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు, సర్పంచ్ గంపల సిద్దారెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీప్రసన్న, అధ్యాపకులు, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ గృహ ప్రవేశంలో ఎమ్మెల్యే...

నాగల్‌గిద్ద, మే 11, ప్రభాతవార్త:

పేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం పాలన సాగిస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని కూబ తాండలో నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటిని ఎమ్మెల్యే ప్రారంభించి గృహవాసులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడుతూ పేదల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీటవేస్తోందని గుర్తుచేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు

-జోగిపేట మార్కెట్ కమిటీ చైర్మన్ ఎం.జగన్మోహన్‌రెడ్డి

జోగిపేట, మే 11, ప్రభాతవార్త:

ప్రతి ఒక్క పేద కుటుంబానికి స్వంత ఇంటి కళ నెరవేర్చాలనే ఉద్దేశంతో తమ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలుచేస్తుందని జోగిపేట మార్కెట్‌కమిటీ చైర్మన్ ఎం.జగన్మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలపరిధిలోని తాలెల్మలో ఇందిరమ్మ పథకం కింద నిర్మించుకున్న ఇళ్లను మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశానుసారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్లను అర్హులైన అందరికీ అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. అయితే మొదటిదశలో స్వంతంగా ఖాళీస్థలం ఉన్నవారికి అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈపథకాన్ని అర్హులైనవారు అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గంగాధర్ సునీతఅశోక్, మాజీ సొసైటీచైర్మన్ నరెందర్‌రెడ్డి, మధుసూధన్‌రెడ్డి, మండలకాంగ్రెస్ అధ్యక్షులు శివరాజ్, మాసానిపల్లి మాజీసర్పంచ్ అశోక్, కాంగ్రెస్‌నాయకులు బగిలి మల్లప్ప, మేతరి ప్రసాద్, మల్లేశం, సిందోళ్ మల్లేశం, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

కుసంగిలో విద్యార్థులకు సమ్మర్ క్యాంపు

కుసంగిలో విద్యర్థులకు సమ్మర్ క్యాంపు దృశ్యం

టేక్మాల్, మే 11, ప్రభాతవార్త:

తెలంగాణ ప్రజాప్రభుత్వం ప్రజాపాలన ప్రగతిప్రణాళిక కార్యక్రమంలో భాగంగా విద్య వారోత్సవాలను పురస్కరించుకుని కుసంగి పిఎంశ్రీ ఉన్నత పాఠశాల ఉచిత సమ్మర్ క్యాంపును ఏర్పాటుచేశారు. సోమవారం కుసంగి గ్రామ సర్పంచ్ సంగమేశ్వర్‌గౌడ్, మండల విద్యాధికారి సుజాత, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ప్రసన్నవదనలు ప్రారంభించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఎఈ రమేష్, గ్రామ ఉపసర్పంచ్ సుబ్బారావు, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ సావిత్రి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, వార్డు సభ్యులు దుర్గయ్య, అనిల్‌గౌడ్, వెంకట్‌గౌడ్, చంద్రకళ, గ్రామపెద్దలు అంజయ్య, రామకృష్ణరెడ్డి, అడివయ్య, మొగులయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులున్నారు.

అసద్‌గంజ్ పిఎంశ్రీ జడ్పిహెచ్ఎస్‌లో సమ్మర్‌క్యాంప్

జడ్పీహెచ్ఎస్‌లో సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్న దృశ్యం

మొగుడంపల్లి, మే 11, ప్రభాతవార్త:

మండలపరిధిలోని అసద్‌గంజ్‌లోని పిఎంశ్రీ జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో సోమవారం సమ్మర్‌క్యాంప్ కార్యక్రమాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు తుల్జాబాయి ప్రారంభించారు. ఈసందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు తుల్జాబాయి మాట్లాడుతూ సమ్మర్‌క్యాంప్‌లో విద్యార్థులకు విద్యతోపాటు సాంస్కృతిక, క్రీడా, సృజనాత్మక కార్యక్రమాలపై ప్రత్యేకశిక్షణ అందించనున్నట్లు పేర్కొన్నారు. వేసవి సెలవులను విద్యార్థులు సద్వినియోగం చేసుకునేందుకు సమ్మర్ క్యాంప్ ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంఘం అభివృద్ధికి పాటు పాడుతాం

సహకార సంఘం చైర్మన్ పాలకవర్గ సభ్యులకు సన్మాన దృశ్యం

పాపన్నపేట, మే 11, ప్రభాతవార్త:

రైతుల సహకారాలతోనే సహకారసంఘాలు అభివృద్ధిపథకంలో పయనిస్తాయని కొత్తపల్లి సహకార సంఘం చైర్మన్ త్యార్ల రమేష్‌గుప్తా అన్నారు. సోమవారం కొత్తపల్లి సహకార సంఘం చైర్మన్ కార్యాలయంలో పదవీబాధ్యతల స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రాష్ట్రంలోని సహకారసంఘం పాలకమండల పదవులను పొడిగిస్తూ ఉత్తర్వులు జారీచేయడంతో తిరిగి పాలకమండలి పదవీబాధ్యతలు స్వీకరించినట్లు వారు పేర్కొన్నారు. రైతుల అభ్యున్నతికి పాలకమండలి కృషిచేస్తుందని, సహకారసంఘం కోసం కొత్తపల్లి భద్రప్ప తన ఐదు ఎకరాల భూమి విరాళంగా ఇవ్వడం మూలంగా గ్రామంలో సహకారసంఘం ఏర్పాటయ్యిందని, వారు చేసిన భూదానం మరువలేనిదని వారికి శాశ్వత నామినేట్ పదవి ఇచ్చేలా తీర్మానంచేయాల్సిన బాధ్యత ఉందన్నారు. ఈసందర్భంగా చైర్మన్ రమేష్, డైరెక్టర్‌లు శోభారాణి, బీమప్ప, మహిపాల్, సుధాకర్‌రెడ్డి, సత్యనారాయణ, పోషరాజు, సంతోష, దుర్గమ్మ, నర్సింలు, నాగమ్మ, జాఫర్ అలీ, కిష్టయ్యలను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా కిసాన్‌సెల్ అధ్యక్షులు ప్రభాకర్‌రెడ్డి, మాజీ జడ్పిటిసి మల్లప్ప, మాజీ చైర్మన్లు పర్శ నర్సింలు, వెంకటేశ్వర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, యాదగిరి, ప్రసాద్, రామగౌడ్, ఇద్రసేనరెడ్డి, రైతులు, సిఒ వెంకటేశ్వర్‌రెడ్డి, సిబ్బంది రవి, వెంకటేశం, తదితరులు ఉన్నారు.

రైతులు శాస్త్రవేత్తల సూచనలు పాటించాలి

-జిల్లా వ్యవసాయాధికారి శివప్రసాద్

సమావేశంలో మాట్లాడుతున్న యూనివర్శిటీ రిజిస్ట్రార్ విద్యాసాగర్

జోగిపేట, మే 11, ప్రభాతవార్త:

రైతులు వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించగలుగుతారని జిల్లా వ్యవసాయాధికారి శివప్రసాద్ తెలిపారు. సోమవారం మండలపరిధిలోని డాకూరు, కొట్టాల గ్రామాల్లో నిర్వహించిన రైతుముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్లో డిమాండు ఉన్న వరికాలను పండించటంద్వారా రైతులకు గిట్టుబాటు అవుతుందన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డా.జిసిహెచ్.విద్యాసాగర్‌తోపాటు, జోగిపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎం.జగన్మోహన్‌రెడ్డి, శాస్త్రవేత్తలు విజయ్‌కుమార్, హేమలత, కె.అరుణ, ఎ.నిర్మల, శ్రీరంజిత, రమాదేవి, శ్రీర, శ్రీనివాస్, డాకూరు సర్పంచ్ వసంత్‌రెడ్డి, డైరెక్టర్లు అశోక్, వహీద్, విఠల్‌లతోపాటు రైతులు పాల్గొన్నారు.

సిర్గాపూర్ పిఎంశ్రీ జడ్పిహెచ్ఎస్‌లో సమ్మర్‌క్యాంప్

పిఎంశ్రీ జడ్పిహెచ్ఎస్‌లో సమ్మర్ క్యాంప్ ప్రారంభిస్తున్న దృశ్యం

సిర్గాపూర్, మే 11, ప్రభాతవార్త:

మండల కేంద్రమైన సిర్గాపూర్‌లోని పిఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం సమ్మర్ క్యాంప్‌ను మండల విద్యాధికారి నాగారం శ్రీనివాస్ ప్రారంభించారు. వేసవి కాలంలో బాల బాలికలకు ఉల్లాసంతో పాటు ఉత్సాహాన్ని నింపుతూ, ఆడుతూ పాడుతూ విద్యను అభ్యసించుటకు గాను వేసవి శిబిరంను ఈ నెల 25వ తారీఖు వరకు నిర్వహిస్తారు. విద్యార్థులచే వ్రాత, డ్రాయింగ్, అల్లికలు, కథలు చెప్పడం, యోగ, కంప్యూటర్ నైతిక విలువలు, జీవన నైపుణ్యాలు లాంటి అనేక అంశాలపై శిక్షణ ఇవ్వనున్నామని మండల విద్యాధికారి నాగారం శ్రీనివాస్ పేర్కొన్నారు. కార్యక్రమంలో శిక్షకులు రవికుమార్, స్వప్న, వెంకట్‌రావు, కృష్ణ యాదవ్, విద్యార్థులు పాల్గొన్నారు.

జనగణనలో భాగంగా ప్రారంభమైన ఇళ్ల గణన

ఎల్లాపూర్‌లో జనగణన చేస్తున్న ఎన్యూమరేటర్‌లు

పాపన్నపేట, మే 11, ప్రభాతవార్త:

మండలపరిధిలోని వివిధగ్రామాల్లో జనగణనలో భాగంగా ఇళ్ల గణన సోమవారం ప్రారంభమైంది. ఇందులో భాగంగా ముందుగా మొదటిరోజు సోమవారం ఆయాగ్రామాల్లో ఇళ్ల సరిహద్దులు చూసుకోవడం ప్రారంభించారు. పాపన్నపేట మండల పరిధిలో జనాభా గణనలో భాగంగా 93 మంది ఎన్యూమరేటర్‌లు, 16మంది సూపర్‌వైజర్‌లు ఈ కార్యక్రమంలో పాలుపంచుకుంటున్నారు. తొలిరోజు సూపర్‌వైజర్‌లు, ఎన్యూమరేటర్‌లు తమపరిధిలోని బ్లాక్‌లను సందర్శించి కేటాయించిన ఇళ్లను సరిచూసుకొని మ్యాప్‌ల తయారీకి ప్రణాళిక చేసుకున్నారు. ఇళ్లకు నెంబర్‌రింగ్ కేటాయించిన అనంతరం ఇళ్ల గణన చేయనున్నారు, ఈగణన జూన్ 9వరకు కొనసాగనున్నది. ఈపాటికే చాలామంది ఉద్యోగులు సెల్ఫ్‌ఎన్యూమరేషన్ చేసుకోవడం మే 10 నాటికి పూర్తిచేసుకున్నారు.

ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు

పెద్దశంకరంపేట, మే 11, ప్రభాతవార్త:

ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతగానో దోహదపడతాయని పెద్ద శంకరంపేట సర్పంచ్ జంగం రేణుకశ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని గాంధీచౌరస్తావద్ద గ్రామపంచాయతీ కార్యాలయం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని సర్పంచ్ జంగం రేణుకశ్రీనివాస్ సోమవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవి కాలంలో బాటసారుల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో ఈవో వెంకట రాములు. పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భూభారతి వచ్చినా తీరని సమస్యలు

-ఒకరి పేరుపై ఉన్న భూమి మరొకరికి పట్టా

-ప్రజావాణిలో ఆర్డీవోకు మొరపెట్టుకున్న బాధితుడు

ఆర్డీవోకు వినతిపత్రం అందజేసిన బాధితుని సోదరుడు వెంకటరాములు

గజ్వేల్, మే 11, ప్రభాతవార్త:

గత బిఆర్ఎస్ ప్రభుత్వం మాదిరిగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా, వ్యవసాయ భూములకు సంబంధించి ధరణిలో అవకతవకలను అధికారులు సరిచేయలేకపోతున్నారు. గత ప్రభుత్వంలో ధరణి వ్యవస్థ మూలంగా రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని కాంగ్రెస్‌పార్టీ తమ ఎన్నికలప్రచారంలో ముఖ్య ఎజెండాగా తీసుకొని ధరణినితీసి బంగాళాఖాతంలో కలుపుతామని ప్రచారం జోరుగానిర్వహించారు. ప్రజలు, రైతులు నమ్మి కాంగ్రెస్‌పార్టీకి పట్టంకడితే భూభారతిని తీసుకువచ్చి రెండున్నర సంవత్సరాలు గడుస్తున్నా, గతంలో ఉన్న ధరణిసమస్యల లోటుపాట్లను అధికారులు తీర్చలేకపోతున్నారు. రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం వల్ల ఒకరి పేరు మీద ఉన్న భూమి మరొకరి పేరు మీద పట్టా అయిన సంఘటన గజ్వేల్ మండలం అహ్మదీపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. అహ్మదీపూర్ గ్రామానికి చెందిన ఆడెపు సోమమ్మ తన వ్యవసాయ భూమి 18 గుంటలు సర్వే నెం.642 అ/2, అదే గ్రామానికి చెందిన ఆడెపు బాలయ్యకు చెందిన 640అ/2లో 25 గుంటల భూమి ఉండగా వారు ఎనిమిది సంవత్సరాల క్రితం గ్రామంలో రైతులకు కౌలుకు ఇచ్చి బతుకుదెరువు కోసం భీమండికి వెళ్ళారు. ప్రతిసంవత్సరం ఆభూమిమీద వచ్చే కౌలు రూపాయలు తీసుకుంటున్నారు. ఇదిలా ఉండగా, బిఆర్ఎస్ ప్రభుత్వంలో ధరణి రావడంతో ఆడెపు సోమమ్మ, ఆడెపు బాలయ్యకు సంబంధించిన భూమి అదేగ్రామానికిచెందిన పాల దానయ్య, శేగ్గారి రాంరెడ్డిల పేరు మీద ఆన్‌లైన్‌లో రావడంతో ఖంగు తిన్న పట్టాదారులు గత నాలుగు సంవత్సరాల నుండి తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా, అధికారులు పట్టించుకోవడంలేదని వాపోతున్నారు. ఇదిలా ఉండగా, సోమవారం ఆర్డీవో కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించగా బాధితుడు ఆర్డీవోను ఆశ్రయించి మొరపెట్టుకున్నారు. బాధితునికి తగిన న్యాయం చేస్తామని ఆర్డీవో భరోసా ఇచ్చారు. అ